ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3

ప్రకాశం

జిల్లా వార్తలు

సోమవారం 19, మే 2025

నేడు శింగరకొండలో మహాకుంభాభిషేకం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం విద్యుత్ కాంతులతో శోభిల్లుతోంది. సోమవారం నిర్వహించనున్న మహాకుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శృంగేరి పీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతీ స్వామి ఆధ్వర్యంలో ఈ క్రతువు నిర్వహించనున్నారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు పాల్గొననున్నారు. భారీగా తరలివచ్చే భక్తులుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, అద్దంకి



నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

- ఒకే కేంద్రంలో టెన్త్ రెగ్యులర్, ఓపెన్ స్కూల్‌కు నిర్వహణ
- 'ఓపెన్' ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా కేంద్రాలు

ఒంగోలు విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ.. ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 4,283 మంది హాజరుకానున్నారు. వారిలో బాలురు 2,400 మంది, బాలికలు 1,883 మంది ఉన్నారు. వీరికోసం 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం



9.30నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. కాపీయింగ్‌ను కట్టడి చేసేందుకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. ఒకే కేంద్రంలో రెండు రకాల పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వాటిలో 11 కేంద్రాలను ఓపెన్ స్కూలు సొసైటీకి సంబంధించిన 1,250 మందికి కూడా కేటాయించారు. రెండు పరీక్షలను వేర్వేరుగా చీఫ్‌లు, డీవోలు, ఇన్విజిలేటర్లు పనిచేస్తారు. ఓపెన్ సొసైటీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 3,132 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారికోసం ప్రత్యేకంగా 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

టీడీపీలో మహా సందడి

- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల నేతృత్వంలో సభలు, ర్యాలీలు
- 23న ఒంగోలులో పార్లమెంట్‌స్థాయి కార్యక్రమం
- ఈలోపు పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు
- 27నుంచి 29 వరకు కడపలో మహానాడు
- భారీగా తరలివెళ్లనున్న తెలుగు తమ్ముళ్లు

నేటి నుంచి 22 వరకూ నియోజకవర్గస్థాయి మినీ మహానాడులు

తెలుగుదేశం పార్టీలో మహానాడు సందడి మొదలైంది. సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఏటా రాష్ట్రస్థాయిలో మహానాడును ఆ పార్టీ ఘనంగా నిర్వహిస్తోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి నియోజకవర్గ, జిల్లాస్థాయిలో మినీ మహానాడులు ఏర్పాటు చేస్తోంది. ఆ సందర్భంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ కమిటీల నియామకం జరుగుతుంది. ఈక్రమంలో ఈనెల 27నుంచి 29 వరకూ మూడు రోజులపాటు పార్టీ మహానాడు కడపలో జరగనుంది. తొలిసారి అక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలోపు నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయి మహానాడుల పూర్తికి అధిష్ఠానం ఆదేశించింది. ఈనెల 14న జరిగిన టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశంలో ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది.


కనిగిరిలో మినీమహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఒంగోలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 22లోపు మినీ, 23నుంచి 25లోపు పార్లమెంట్‌స్థాయి మహానాడులు పూర్తిచేయాలని టీడీపీ అధిష్ఠానం ఆదేశించింది. ఆలోపు డివిజన్, పట్టణ, మండల పార్టీ కమిటీలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వరుసగా మూడు సార్లు లేదా ఆరేళ్లపాటు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన వారిని మార్చి ఆస్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని పార్టీ సూచించింది. ఇప్పటి వరకు ఆ బాధ్యతల్లో పనిచేసి నేటికీ క్రియాశీలకంగా ఉన్న వారికి ఆపైస్థాయి కమిటీల్లో స్థానం కల్పించాలని స్పష్టం చేసింది. టీడీపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆయాస్థాయిలో పార్టీ బాధ్యతల కోసం అనేక మంది పోటీ పడుతున్నారు.

ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలు

మినీ మహానాడుల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించి తీర్మానాలు చేసి రాష్ట్ర పార్టీకి పంపాలని అధిష్ఠానం అదేశించింది. ఇదిలా ఉండగా కడపలో ఈనెల 27నుంచి 29 వరకు జరగనున్న టీడీపీ మహానాడుకు జిల్లా నుంచి పార్టీశ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నాయకులు కడప నగరంలో బసకు సంబంధించి సొంత ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. మొత్తం మీద నవ్యాంధ్రలో రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం తొలిసారిగా మహానాడులు జరగనుండగా టీడీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు

జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గస్థాయి మహానాడుల నిర్వహణకు అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల మినీ మహానాడులు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం జరగనున్నాయి. గిద్దలూరు నియోజకవర్గ మహానాడు ఈనెల 20న గిద్దలూరులో నిర్వహించను న్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ మినీ మహానాడు 22వతేదీన ఒంగోలు నగర పరిధిలోని త్రోవగుంటరోడ్డులో ఉన్న విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేశారు. ఒంగోలు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలకు సంబంధించి సోమవారం స్పష్టత రానుంది. ఒంగోలు పార్లమెంట్ స్థాయి మినీమహానాడు ఈనెల 23వతేదీన ఒంగోలులో జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో దానిని నిర్వహించనున్నారు.



వైద్యశాఖలో ఉద్యోగోన్నతులపై 22న విచారణ

నోటీసులు జారీచేసిన ఎస్‌డీసీ

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని సచివాలయ ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఈనెల 22న విచారణ జరగనుంది. ఈమేరకు విచారణాధికారి అయిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్/ఎస్‌డీసీ మాధురి సంబంధిత అధికారులకు నోటీసులు పంపారు. మార్చిలో నిర్వహించిన సచివాలయ ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య కొద్దిరోజుల క్రితం జేసీ గోపాలకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. సీనియారిటీ జాబితాలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. స్పందించిన జేసీ.. ఉద్యోగోన్నతులపై సమగ్ర విచారణ చేసి నివేదికను అందజేయాలని ఎస్‌డీసీ మాధురిని ఆదేశించారు. దీంతో ఈనెల 11న ఆమె విచారణకు సిద్ధమయ్యారు. ఆరోజు జిల్లాకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఒంగోలు రావడంతో ఆ విచారణను వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 22వతేదీ సాయంత్రం నాలుగు గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించాలని మాధురి నిర్ణయించారు. ఈమేరకు ఫిర్యాదుదారుడు బిల్లా చెన్నయ్యతోపాటు వైద్యశాఖ అధికారులు, ఉద్యోగోన్నతులు నిర్వహించిన కమిటీ సభ్యులకు కూడా నోటీసులు పంపినట్లు సమాచారం. ఉద్యోగోన్నతుల మెరిట్ జాబితాలతోపాటు అందుకు సంబంధించిన అన్ని ఫైళ్లను అందుబాటులో ఉంచాలని ఆ నోటీసుల్లో ఆమె సూచించారు. ఇదిలా ఉండగా కొంతమంది అర్హత లేకపోయినా ఉద్యోగోన్నతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాని వెనుక పెద్దమొత్తంలో డబ్బులు కూడా చేతులు మారినట్లు తెలుస్తోంది. ఫోన్ పేలో కార్యాలయానికి సంబంధించిన వ్యక్తులు కాకుండా ఇతరుల ద్వారా వసూళ్లు చేశారన్న ప్రచారం కూడా నడుస్తోంది. దీనిపై కూడా ఎస్‌డీసీ విచారణ చేయయనున్నట్లు సమాచారం.

గందరగోళమే!

ఫ్రీ హోల్డ్ భూములపై ఎటూతేల్చని ప్రభుత్వం



- గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా నిర్ణయాలు
- వేలాది ఎకరాలను లాగేసుకున్న ఆపార్టీ నేతలు
- రిజిస్ట్రేషన్‌లపై నిషేధం విధించిన ప్రస్తుత ప్రభుత్వం
- సమస్య పరిష్కారంపై స్పష్టత ఉన్నా నెలల తరబడి వాయిదాలు
- ఆందోళనలో రైతులు

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఫ్రీహోల్డ్‌లో పెట్టిన భూముల వ్యవహారం గందరగోళంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం నెలల తరబడి తాత్సారం చేస్తుండటంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు ఇస్తూ జిల్లాల్లో ఫ్రీహోల్డ్ చేసుకున్న భూములన్నింటినీ నిగ్గుతేల్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో తదనుగుణంగా చర్యలు మొదలయ్యాయి. అలా విభజిత జిల్లాలో ఫ్రీహోల్డ్‌లో లక్షా 36వేల 421 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆమేరకు ప్రభుత్వానికి నివేదించారు. నెలలు గడిచినా వాటిని ప్రభుత్వం ఇంతవరకూ పట్టించుకోలేదు. తాజాగా ఫ్రీహోల్డ్ భూములపై నిర్ణయాన్ని మరో రెండు నెలలపాటు వాయిదా వేయడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని కారణంగా చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పశ్చిమ ప్రాంతంలో అధికం

గత వైసీపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రత్యర్థులను బెదిరించేందుకు వీలుగా అడ్డగోలుగా నిర్ణయాలను తీసుకుంది. అనేక ప్రాంతాల్లో వివాదాస్పద, అనువంశిక భూములను నిషేధిత జాబితాల నుంచి బయటకు తీసి వేలాది ఎకరాలను ఫ్రీహోల్డ్ చేసింది. అలాంటివి పశ్చిమప్రాంతంలోని మండలాల్లో అధికంగా ఉన్నాయి. ఇలా నిషేధ జాబితా నుంచి బయటకు వచ్చిన భూములన్నింటినీ వైసీపీ నాయకులు లాగేసుకున్నారు. వాటిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. ఆ భూముల్లో కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించింది. తొలుత రెండు నెలలపాటు నిషేధం అని చెప్పిన పొడిగిస్తూ పోతోంది. ప్రస్తుతం కూడా ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని మరో రెండు నెలలపాటు అంటే జూలై 11 వరకు పొడిగించింది. ఇలా ప్రభుత్వం పొడిగిస్తూ పోతుండటంతో భూములు కోల్పోయిన రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. వారిలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోట్లు వెచ్చించినా

తప్పని పాట్లు!

- కంభం చెరువు పంట కాలువల్లో పూడికతీత పేరుతో స్వాహా
- ఎక్కడి చెత్త అక్కడే
- తొలగించని ఆక్రమణలు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

కంభం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన కంభం చెరువు పంట కాలువలు, తూముల మరమ్మతుల్లో మాయ జరుగుతోంది. రూ.కోట్లు వెచ్చించినట్లు చూపుతున్నా ఆయకట్టు రైతులకు మాత్రం పాట్లు తప్పని పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారుల అవినీతి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ఇందుకు కారణమైంది. గత 15 సంవత్సరాల్లో కోట్లాది రూపాయల నిధులు మంజూరైనప్పటికీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. పంట కాలువలు దట్టంగా పెరిగిన చిల్లచెట్లు, చెత్తతో నిండి కనిపిస్తున్నాయి. కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. కాలువలను ఆక్రమించుకుని నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించిన అధికారులు నోటీసులతో సరిపెట్టుకుంటున్నారు. పూడిక తీశామని చెప్తున్నా కాలువల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ప్రభుత్వం చెరువు, కాలువల మరమ్మతులకు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నా స్థానిక ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్లతో కలిసి వాటిని పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పదేళ్ల క్రితం జపాన్ ప్రభుత్వం కంభం చెరువు అభివృద్ధి, కాలువల మరమ్మతులకు రూ.9 కోట్లు మంజూరు చేయగా తూతూమంత్రంగా పనులు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. బాధ్యులపై చర్యలు కరువయ్యాయి. అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతికి ప్రధాన కారకునిగా ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి డీఈ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మరలా ఇరిగేషన్ పంట కాలువల పూడికతీత, ఆక్రమణల తొలగింపు పేరిట రూ.28లక్షలు మంజూరయ్యాయి. మూడు నెలల క్రితం కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ పర్యాయం కూడా పనుల తీరు పాతవిధానంలోనే కొనసాగుతుండడంపై రైతులు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కంభం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పార్శ ఆదినారాయణ ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి బహిరంగంగానే ఇరిగేషన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పంట కాలువలపై నిర్మించిన బహుళ అంతస్థులు

పంట కాలువలపై పాగా

ఇరిగేషన్ పంట కాలువలపై యథేచ్ఛగా ఆక్రమణలు జరిగి అక్రమ కట్టడాలు, చప్టాలు నిర్మించుకున్నా అడిగేవారు లేకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి వలన పొలాలకు నీరు సక్రమంగా వెళ్లేందుకు దారిలేకుండా పోయింది. ఆయకట్టుకు నీరందడం లేదు. కాలువలు ఆక్రమించి కొంతమంది బహుళ అంతస్థులు నిర్మించారు. ఇదేవిధంగా నిర్మాణాలు కొనసాగితే కొంత కాలానికి కాలువలు మాయమవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.


పూడిక తీసినట్లు చెబుతున్న ప్రధాన పంట కాలువ దుస్థితి ఇదీ

మోకాళ్లపై సీహెచ్‌వోల నిరసన

సమస్యలను పరిష్కరించాలని చర్చి సెంటర్‌లో మానవహారం


చర్చిసెంటర్‌లో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆదివారం ఒంగోలులో నిరసన ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. 20 రోజులుగా కలెక్టరేట్ ఎదుట దీక్షలు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆదివారం నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. కలెక్టరేట్ వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం చర్చిసెంటర్‌లో మానవహారం నిర్మించారు. మోకాళ్లపై కూర్చొని తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్‌కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. రూ.40వేలు ఇస్తామని సర్క్యులర్ ఇచ్చి ప్రస్తుతం కేవలం రూ.25వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. గ్రామీణ, కొండ ప్రాంతాల్లో పనిచేస్తుంటే ఎఫ్ఆర్ఎస్ అని చెప్పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వేతనాలు కట్ చేయడం దుర్మార్గంగా ఉందని చెప్పారు. ఎన్ఎంహెచ్ ఉద్యోగులందరికీ 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగళగిరి రాజేష్, శ్రీకాంత్, గంట ప్రసన్న, జీవన్‌జ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎల్ కాంతారావు అధ్యక్షత వహించారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని,పదో తరగతి పరీక్షలకు సంబంధించిన రెన్యూమరేషన్ టీఏ, డీఏలు చెల్లించాలని, వేసవి సెలవుల్లో పనిచేసిన హెచ్ఎంలకు ఎర్న్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. ఎంఈవో-1 ఖాళీ అయిన మండలాల్లో అక్కడి సీనియర్ హెచ్ఎంలకు ఇన్‌చార్జిలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వై. వెంకట్రావు, డీసీఈబీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, కోశాధికారి జీఎస్ఆర్ సాయి, హెచ్ఎంలు ఎ. వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసరావు, పీఏ పద్మనాభరావు, పీఎం ఖాన్ ఉన్నారు.

ఉపాధ్యాయ ఐక్యవేదిక ఏర్పాటు


ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్‌కమిటీ సభ్యులు

ఒంగోలువిద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఎస్కే అబ్దుల్ హై(యూటీఎఫ్), డి. శ్రీనివాసులు(ఏపీటీఎఫ్), కే యర్రయ్య(ఎస్‌టీయూ), ఎన్. లక్ష్మీనారాయణ(ఏపీటీఎఫ్ 1938), కే మల్లికార్జునరావు(ఆపస్), పి. శ్రీనివాసరావు(పీఆర్‌టీయూ), వై. వెంకట్రావు(హెచ్ఎం అసోసియేషన్), పి. రమణారెడ్డి(వైఎస్ఆర్‌టీఏ)లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విద్యారంగాన్ని బలహీనపర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 21న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రావణ్‌కుమార్, చల్లా శ్రీనివాసులు, బి. రఘుబాబు, పీవీ సుబ్బారావుతో పాటు తొమ్మిది సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

సింగరాయకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో సైనిక దళాలకు మద్దతుగా ఆదివారం సింగరాయకొండలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక కందుకూరు రోడ్డు కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకూ కొనసాగింది. ర్యాలీలో సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బాలకోటయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మనోజ్‌కుమార్ కూటమి నాయకులు వేల్పుల సింగయ్య, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్

సింగరాయకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ యుద్ధ వాతావరణ నేపథ్యంతో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామాయపట్నం మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్ సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెంలో శనివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. గ్రామంలోని కాపులు, ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని తెలిపారు. అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తూ ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1093, రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


మాట్లాడుతున్న మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్

తిరుమలకు మార్టూరు నుంచి కూరగాయలు

మహిళల పూజలు, కోలాటం మధ్య లారీకి వీడ్కోలు


లారీ ముందు కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు

మార్టూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుని స్వామి నివాసం ఉండే తిరుమలలోని అన్నదానసత్రానికి ఆదివారం మార్టూరు నుంచి లక్షన్నర రూపాయలు విలువచేసే కూరగాయలను లారీలో పంపించారు. బండారుపల్లి హరిబాబు కుటుంబసభ్యులు దాతృత్వంతో భక్తులు కూరగాయలను కొనుగోలు చేసి తిరుపతి తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన లారీలో కూరగాయలను వేసి పంపించారు. ఈ సందర్భంగా మార్టూరులో తూర్పుబజారున వినాయకుని గుడి వద్ద కూరగాయల లారీ వద్ద దాత హరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, కంభంపాటి శ్రీనివాసరావు, దివ్వెప్రసాద్, తేలప్రోలు శ్రీనివాసరావు, కమ్మ శివనాగేశ్వరరావు తదితరులు వినాయకుని గుడిలో స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అక్కడ నుండి కూరగాయల లారీ బొడ్డురాయిసెంటరు, గన్నవరం రోడ్డు గుండా ర్యాలీగా పెద్ద ఖానా వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా కోలాటం ప్రదర్శించారు. పెద్దఖానా వద్ద పలువురు మహిళలు కూరగాయల లారీవద్ద హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి వారి లడ్డూ ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం తిరుమలకు బయలుదేరిన లారీకి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

రాజస్థాన్ కార్మికుడి మృతిపై కేసు

చీమకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు ఆదివారం మృతి చెందాడని సీఐ సుబ్బారావు చెప్పారు. స్వరూప్‌రావు(34) అనే కార్మికుడు డ్యూటీ ముగించుకున్న తదుపరి తన గదికి వచ్చి నిద్రపోయాడని, అదే రూంలో ఉంటున్న మరో కార్మికుడు కొంత సేపటి తర్వాత స్వరూప్‌రావును నిద్రలేపగా లేవకపోవటంతో తోటి కార్మికులకు విషయాన్ని తెలిపాడు. వారు వచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నేడు కొండపిలో మినీ మహానాడు

హాజరుకానున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

కొండపి, మే 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కొండపిలోని స్థానిక శ్రీ సాయి సీతారామ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నారు. ఈ మినీ మహానాడుకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన ద్వారా కోరారు.

మిస్టరీగా పర్చూరులో యువకుని మృతదేహం

మార్చురీలో డెడ్‌బాడీ

పర్చూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో గుర్తు తెలియని యువకుని మృతి మిస్టరీగా మారింది. మృతి చెందిన యువకుడు ఎవరనే విషయం తెలియకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలోనే ఉంచారు. మృతదేహం పడిఉన్న తీరు, మృతుని వయస్సు తదితర అంశాలను పరిశీలించి యువకుడు ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తిగా ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ప్రయాణికులు ప్రజలతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండే ప్రాంతంలో ఇలా గుర్తు తెలియని మృతదేహం లభించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు మాత్రం యాచకుడై ఉంటాడని చెబుతున్నారు. ఏది ఏమైనా పూర్తిస్థాయి విచారణ చేపడితే తప్ప మృతదేహం ఎవరిది, మృతికి గల కారణాలు ఏమిటి అన్న విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొని వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌వలి

అద్దంకి, మే 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శింగరకొండ రోడ్డులోని ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొనడంతో ఇందిరాగనర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు.

పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్యకు అభినందనలు

అవీఇవీ


సీతారామయ్యను అభినందిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామయ్య వైద్యరంగంలో అనేక సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని, అలాగే పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులు కావడం మరింత ఆనందంగా ఉందని చెప్పారు. సీతారామయ్య భవిష్యత్‌లో మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్‌లు బీఎస్ సీతారామయ్య, జాలాది మణిబాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి జయశేఖర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

సీతారామయ్యను కలిసిన టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన కామేపల్లి సీతారామయ్యను బి.నిడమానూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఒంగోలులో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పైడి నాగేశ్వరరావు, మోషే, సౌలు, బాబురావు,వెంకట్రావు తదితరలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు సహకరించాలి

ఒంగోలు విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి అందరూ సహకరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున మోడల్ ప్రైమరీ స్కూళ్లను వారు స్వాగతించారు. 59 మంది పిల్లలకు నాలుగు, 60 మందికిపైన ఐదు పోస్టులు ఇస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైస్కూళ్ల నుంచి 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చే క్రమంలో మిగులుగా తేలుతున్న స్కూలు అసిస్టెంట్లను ఆదర్శ పాఠశాలల హెచ్ఎంలుగా నియమించడానికి చేస్తున్న ప్రయత్నాలను వారు వివరించారు. విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనేందుకు వీలుగా ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషుతో పాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలని కోరారు.

1న అంబేడ్కర్ యువజన సంఘం మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో వచ్చేనెల 1వ తేదీన అంబేడ్కర్ యువజన సంఘం ప్రథమమహాసభ జరుగుతుందని ఐపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల వద్ద ఆదివారం మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దాసరి సంగీతరావు, నాగేశ్వరరావు, రమేష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అంకన్న సుబ్బారావు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలతో విజ్ఞానం



తెలుగు పదాలు పలికే విధానాన్ని వివరిస్తున్న శామ్యూల్

నాగులుప్పలపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల ద్వారా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలతో విజ్ఞానం పెంపొందుతుందని ఉప్పుగుండూరు గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ చెప్పారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా ఆదివారం ఉప్పుగుండూరు శాఖ గ్రంథాలయంలో తెలుగుపదాలు పలికే విధానాన్ని రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపల్ తెలగతోటి శామ్యూల్ వివరించారు. తెలుగు పద్యాలు చదివే విధానం, వాటి అర్థాలను తెలుగు ఉపాధ్యాయులు గాధంశెట్టి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలు వాటి ప్రాముఖ్యతను ఉపాధ్యాయురాలు నాగరజకుమారి వివరించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

● ఒకే ప్రాంతంలో తరచూ ఘటనలతో ప్రజలు భయాందోళన

కొత్తపాలెం(చీరాల), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపడి గేదె మృతిచెందింది. అర్ధరాత్రి సమయం నుంచే చాలా సేపు ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలోనే పిడుగుపాటుతో అక్కల జాలమ్మకు చెందిన గేదె మృతి చెందింది. దీంతో బాధితురాలు లబోదిబోమంటున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికే వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే సమీపంలోనే ఇటీవల పడిన పిడుగుపాటు కారణంగా రెండు ఎడ్లు మృత్యువాత పడిన సంగతి విదితమే. అందుకు ప్రభుత్వం నుంచి సాయం కూడా అందింది. అయితే వరుస ఘటనలతో గ్రామ ప్రజలు భీతిల్లుతున్నారు.

గుంతతో తంటాలు



ఒంగోలులోని జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదురు పాత బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రెండు నెలల క్రితం రోడ్డు పగిలిపోయి ఏర్పడిన గుంత క్రమక్రమంగా పెద్దదైంది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఆ రోడ్డులో వెళుతున్నప్పుడు ఆదమరిస్తే ప్రమాదాల బారినపడాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకుని, పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



వాకర్స్ వెళ్లే దారేది..?


ఒంగోలు నగరంలోని రంగారాయుడు చెరువు ప్రవేశ ద్వారం వద్ద నెల రోజులుగా ముళ్లకంచెలు కొట్టిపడేయడంతో వాకర్స్ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వాకర్స్ వాహనాలు నిలిపేందుకు ఆటంకంగా ఉండటంతో రోడ్డుపైనే నిలివేయాల్సి వస్తుందని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు పట్టించుకుని ముళ్ళ కంచెలు తొలగించాలని కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)





మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరం వద్ద ఓ చెట్టు రెండు నెలల్లో మారిన తీరిదీ





ఒంగోలు నగరంలోని కలెక్టర్ బంగళా వద్ద చెట్టులో మార్పు తీరిలా..

జీవిత పాఠం బోధించెట్టు..

చూడటానికి ఇవి చెట్లు మాత్రమే కావచ్చు. అందమైన ఆకృతే అనిపించొచ్చు. ప్రకృతిలో మార్పు ఫలితమే అవ్వొచ్చు. లోతుగా పరిశీలిస్తే ఇందులో జీవిత పాఠం ఇమిడి ఉంది. చెట్లకు కష్టకాలమైన శిశిరంలో ఆకులన్నీ రాలిపోయి.. కొమ్మలన్నీ ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తాయి. అయితే అది శాశ్వతం కాదనీ, రుతువు మారాక ఎండిన చెట్టు కొత్త చిగురు తొడుగుతుందనీ, కొమ్మలన్నీ పచ్చబడతాయనీ, చెట్టు కాంతివంతమవుతుందనీ ఈ చిత్రాలు చెబుతున్నాయి. మనిషి జీవితం కూడా అంతే. కష్టాలూ కన్నీళ్లు ఎల్లకాలం ఉండవనీ, వాటికి కుంగిపోకూడదనీ, మంచి రోజులు తప్పక ఉంటాయనే గొప్ప పాఠాన్ని ఈ చెట్లు బోధిస్తున్నాయి కదూ! (ఒంగోలు, ఆంధ్రజ్యోతి)



రెడ్‌క్రాస్ మొబైల్ బీపీ బస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు విజయ, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర వైద్యులు

రెడ్‌క్రాస్ మొబైల్ బీపీ బస్ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రారంభించిన 'చెక్ బీపీ- స్టాప్ స్ట్రోక్' కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్, ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం స్థానిక ఐఎంఏ హాలు వద్ద చెక్ బీపీ- స్టాప్ స్ట్రోక్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ, ఐఎంఏ ఒంగోలు అధ్యక్షుడు డాక్టర్ శివ సీతారామయ్య, సెక్రటరీ డాక్టర్ మనిబాబు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భగీరథి, సీనియర్ న్యూరో సర్జన్లు డాక్టర్ సుందరరావు, డాక్టర్ మధుకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా 'చెక్ బీపీ, స్టాప్ స్ట్రోక్' అవగాహన కార్యక్రమానికి సహకరిస్తుందని తెలిపారు. ఐఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయ హైపర్ టెన్షన్, స్ట్రోక్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దేశంలో ప్రతి నిమిషం ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాత) బారిన పడుతున్నారని తెలిపారు. ఏటా 18 లక్షల మందికిపైగా స్ట్రోక్‌తో బాధపడుతున్నారన్నారు. అనంతరం మొబైల్ బీపీ బస్సును డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ విజయ ప్రారంభించారు.



సమ్మె వాయిదాపై చర్చిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

దేశవ్యాప్త సమ్మె వాయిదా

● జూలై 9న నిర్వహించాలని కార్మిక సంఘాల నిర్ణయం

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20వ తేదీన జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడింది. జూలై 9న నిర్వహించాలని అఖిలపక్ష కార్మికసంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్ణయించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వివిధ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈనెల 20న తలపెట్టిన సమ్మె వాయిదా పడిందన్నారు. జూలై 9న నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చాలు నిర్ణయించాయని తెలిపారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో అమలు చేసేందుకు ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఉగ్రవాదులను అణిచివేసేందుకు భారత్, పాకిస్తాన్‌పై యుద్ధం ప్రారంభించి ముగించిందన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల్లోకొన్ని ఉద్రిక్తత పరిస్థితులు ఉన్న కారణంగా సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ ఈనెల 20న ఒంగోలు నగరం, మునిసిపల్ పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సభలు, ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాయి మాట్లాడారు.

విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత

● సగం మందితో నెట్టుకొస్తున్న వైనం
● ప్రైవేటు ఎలక్ట్రీషియన్లపైనే ఆధారం

అద్దంకి, మే18 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత విద్యుత్‌శాఖను వేధిస్తోంది. పరోక్షంగా అటు రైతులు, ఇటు విద్యుత్ వినియోగదారులపై భారం పడుతోంది. ప్రైవేటు ఎలక్ట్రీషియన్లపైనే ఆధారపడాల్సి వస్తోంది.

అద్దంకి విద్యుత్ డివిజన్ పరిధిలో మొత్తం 169 మంది లైన్‌మెన్లు, ఎనర్జీ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా 94 మంది మాత్రమే విధు లు నిర్వహిస్తున్నారు. 75 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కొన్ని మండలాలో విధులు నిర్వ హించే సిబ్బంది కంటే ఖాళీలే అధికంగా ఉన్నాయి. అద్దంకిటౌన్, రూరల్ పరిధిలో 37 మందికిగాను 18 మంది, కొరిశపాడు మండలంలో 21 మందికి గాను 16 మంది, జె.పంగులూరు మండలంలో21 మందికి గాను 9 మంది, బల్లికురవ మండలంలో 25 మందికి గాను 16 మంది, సంతమాగులూరు మండలంలో 25 మందికిగాను 15 మంది, మార్టూరు మండలంలో 24 మందికి గాను 13 మంది, యద్దనపూడి మండలంలో 16 మందికి గాను ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పంగులూరు, యద్దనపూడి, అద్దంకి మండలాల్లో సగం



మంది ఉద్యోగుల తోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నాలుగైదు గ్రామాలకు ఒక్కరే లైన్‌మెన్ కావటంతో ఇబ్బందులు తప్పటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ప్రధానంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు గురైన సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో మరమ్మతులకు వేచి ఉండాల్సి వస్తోంది. అనివార్య పరిస్థితుల్లో ప్రైవేట్ ఎల క్ట్రీషయన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ ఎలక్ట్రీషయన్లు మరమ్మతులు చేయాలంటే రైతులు, ఆయా గ్రామాల ప్రజలు డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారినే ఆశ్రయించి పనులు చేయించుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయాలంటే ఆయా లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేయాల్సి ఉంటుంది. సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేసేందుకు ఆయా ఏఈల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంది. వారికి అధికారులు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) ఇస్తుండటం కూడా విమర్శలకు తావిస్తోంది. సిబ్బంది కొరతతో పరోక్షంగా ప్రైవేట్ ఎలక్ట్రీషయన్లను సైతం అధికారులు ప్రోత్సహించక తప్పని పరిస్థితి అనే భావన కూడా నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్షేత్రస్థాయిలో విద్యుత్ లైన్‌మెన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఉద్వేగభరితం.. అ'పూర్వ' సమ్మేళనం

● హెల్మెట్ లేకుండా ప్రయాణించొద్దన్న పూర్వ విద్యార్థి ● తనకు జరిగిన ప్రమాదం, తల్లిని కోల్పోయిన వైనాన్ని వివరించడంతో కన్నీరు పెట్టిన మిత్రులు

మర్రిపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. 2004-05 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత పాఠశాలలో చేరి ఒకరి అనుభవాలను ఒకరు పంచుకున్నారు. అప్పటి తీపి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. జీవితంలో ఎదురైన ఆటుపోట్లను పంచుకొని ఉద్వేగానికి గురయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెబ్బా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను వెల్లడించారు. ఈ సందర్భంగా గురిజాల ఆంటోని చేసిన సందేశాత్మక ప్రసంగం సభికులను కన్నీరు పెట్టించింది. ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న తాను హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ మర్రిచెట్లపాలెం గ్రామం వద్ద ఆరేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యానని ఆయన తెలిపారు. ఆ ప్రమాదంలో తలకు తగిలిన గాయంతో కోమాలోకి వెళ్లానని చెప్పారు. 9 నెలలపాటు కోమాలోనే ఉండిపోయానని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తాను కోమాలోకి వెళ్లానన్న విషయం తెలుసుకొని తన తల్లి గుండెపోటుతో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి మృతి వార్త సంవత్సరం వరకు తనకు ఎవరూ చెప్పలేదని వేదనాభరితంగా పేర్కొన్నారు. మన సహచరులు ఎవ్వరూ హెల్మెట్ లేకుండా ప్రయాణించ వద్దని విలపించాడు. ప్రయోజకుడినైన తనను చూసి సంతోషపడాల్సిన తల్లి దూరం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి గురిజాల ఆంటోనీ

కావడం పట్ల తీవ్ర మనోవేదనకు గురయ్యానని చెపుతుండగా సభికులందరూ కన్నీటి పర్యంతమయ్యారు. స్నేహితులందరం ఒకరికొకరం కష్టసుఖాల్లో పాలు పంచుకుందామని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. అప్పట్లో విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు ఎం.వెంకటయ్య, బి.నరసింహారావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రామాంజనేయులు, సుధాకర్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు చేయూత అందించాలని ప్రధానోపాధ్యాయులు రెబ్బా వెంకటేశ్వర్లు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఉప్పు సాయిబాబు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షం

● జిల్లా వ్యాప్తంగా 8.2మి.మీ సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 8.2మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. దీంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మార్కాపురం మండలంలో 47.4 మి.మీ., రాచర్ల 37.6, గిద్దలూరు 34.2, నాగులుప్పలపాడు 27.6. తాళ్ళూరు 26.4, తర్లుబాడు 24.4, సంతనూతలపాడు 16.8, పెద్దారవీడు 15.6, కురిచేడు 15.4, ఒంగోలు 12.6, దర్శి 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో పది మండలాల్లో 1.4 నుంచి 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.



ర్యాలీలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

వీర జవాన్లకు వందనాలు

ఎర్రగొండపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన వీర సైనికులకు అభివందనాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో ఆదివారం జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి పటిష్ట భద్రత

అద్దంకి, మే18 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద సోమవారం జరిగే మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని దర్శి డీఎస్పీ మొయిన్ అన్నారు. మహాకుంభాభిషేకం జరిగే ప్రదేశం, క్యూలైన్లను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. సోమవారం ఉదయం గుండ్లకమ్మ నది నుంచి కలశ యాత్ర ఉన్న నేపథ్యంలో అద్దంకి నుంచి శింగరకొండ వరకు ఒకవైపు సుమారు 1500 మందికి పైగా భక్తులు పాదయాత్రగా వెళ్లనున్న నేపథ్యంలో నామ్‌రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు భారీ వాహనాలను మేదరమెట్ల వద్ద నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నామ్ రోడ్డులో ఒకవైపు రోడ్డులో మాత్రమే వాహనాలను అనుమతిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ సారథ్యంలో ఐదుగురు సీఐలు, 17 మంది ఎస్సైలతో పాటు మొత్తం 285 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని పట్టణ సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలో కలశయాత్ర జరగనున్న నేపథ్యంలో అద్దంకి పట్టణ ప్రజలు కూడా ద్విచక్ర వాహనాలు, కార్లు వినియోగించకుండా కాలినడకన వచ్చి తిలకించాలన్నారు.



బొప్పూడిలోని ఆంజనేయస్వామి ఆలయంలో డైరెక్టర్ అనిల్, మిత్ర బృందం

బొప్పూడిలో అనిల్ రావిపూడి ప్రత్యేక పూజలు

● చిరంజీవి 157వ చిత్రం స్క్రిప్ట్ సిద్ధం

మార్టూరు (యద్దనపూడి), మే 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా జాతీయ రహదారి వెంబడి ఉన్న బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రత్యేక పూజలు చేశారు. యద్దనపూడి మండలం, చిలుకూరివారిపాలేనికి చెందిన ఆయన ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి 157వ చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఆదివారం ఈ స్క్రిప్ట్ బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఉంచి డైరెక్టర్ అనిల్ సారథ్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, సూర్య, సాయికృష్ణ, రియాజ్, శిరీష, మిత్రబృందం పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్దకు వచ్చిన శృంగేరిపీఠం ఉత్తరాధికారి భారతీస్వామికి స్వాగతం పలుకుతున్న ఈఓ

శింగరకొండకు చేరుకున్న విదుశేఖర భారతీస్వామి

అద్దంకి, మే18(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించనున్న మహాకుంభాభిషేకంలో పాల్గొనేందుకు శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతీస్వామి ఆదివారం రాత్రి శింగరకొండకు వచ్చారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, రిషిత దంపతులు, ప్రధాన దాతలు ఆయనకు స్వాగతం పలికారు.

కొత్త రైళ్ల జాడేది?

- కనీసం పొడిగింపు బళ్లు కూడా లేవు
- ప్రయాణికులకు ఇబ్బందులు

గిద్దలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు - గిద్దలూరు - గుంతకల్లు రైలు మార్గం మీటర్ గేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌గా రూపాంతరం చెందింది. ఈ మార్గం మొత్తం ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తయింది. సుమారు 400 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో ఇప్పటికే సగానికి పైగా దూరం డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తయింది. రైల్వేస్టేషన్లలో ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి. అయితే ప్రయాణికుల అవసరానికి తగ్గట్లుగా కొత్త రైలు సర్వీసుల ఏర్పాటు మాత్రం జరుగడం లేదు. దాంతో పాత రైళ్ళలోనే సీట్లు దొరకక నిలబడేందుకు కూడా స్థలంలేని పరిస్థితిని ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా బుట్టదాఖలు అవుతున్నాయి. చివరకు ఈ మార్గంలో ఉన్న పార్లమెంటు సభ్యులు సైతం కొత్త రైళ్ల ఏర్పాటు కోసం, ఉన్న రైళ్ల పొడిగింపు కోసం ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

కొత్త రైళ్లేవి?

నంద్యాల నుంచి విజయవాడ వరకు లేదా విశాఖపట్నం వరకు పగటిపూట సూపర్‌ఫాస్టు రైలును తిప్పాలని, ఈ రైలు వలన సాధారణ ప్రయాణికులకే కాకుండా వ్యాపారులకు, ఉద్యోగులకు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఏళ్లతరబడి ప్రయాణికులు చేస్తున్న విజ్ఞప్తులు గాలిలో కలిసిపోతున్నాయే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. అలాగే విజయవాడ నుంచి గిద్దలూరు, గుంతకల్లు మీదుగా ముంబయికి ఎక్స్‌ప్రెస్ సర్వీసును నడపాలని చేస్తున్న విజ్ఞప్తులు ఎవరికీ పట్టడం లేదు.

పొడిగింపులు కూడా లేవు

కొత్త రైళ్లను ఎలాగూ ప్రవేశపెట్టడం లేదు, కనీసం తిరుగుతున్న రైళ్లను పొడిగించాలని చేస్తున్న విజ్ఞప్తులు కూడా రైల్వే అధికారుల చెవులకు చేరడం లేదు. నంద్యాల నుంచి కడప వరకు, నంద్యాల నుంచి కర్నూలు వరకు తిరుగుతున్న డెమో రైళ్లను గిద్దలూరు వరకు పొడిగించాలని ప్రయాణికులు విజ్ఞప్తులు చేస్తున్నారే తప్ప అధికారులు కనీసం ప్రతిపాదనలు కూడా పంపకపోవడం విమర్శలకు తావిస్తున్నది. తెనాలి నుంచి మార్కాపురం వరకు తిరుగుతున్న రైలును గిద్దలూరుకు వరకు పొడిగించాలని అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. రైళ్లు వచ్చి ఇక్కడి నుంచి రిటర్న్ పోయేందుకు వీలుగా తగినన్ని ప్లాట్‌ఫారాలు, ఇంజన్ షెడ్లు లాంటి సౌలభ్యాలు ఉన్నప్పటికీ ప్రయాణికుల విజ్ఞప్తులు పట్టించుకోక పోవడం శోచనీయం. గుంటూరు నుంచి గిద్దలూరు మీదుగా తిరుపతి వరకు తిరుగుతున్న రైలును చెన్నై వరకు పొడిగించాలని పార్లమెంట్ సభ్యులు, ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఈప్రాంతవాసులు చెన్నై వెల్లాలంటే తిరుపతికి వెళ్లి మరో రైలు లేదా బస్సులో చెన్నై వెళ్లాల్సి ఉంది. లేదా ఒంగోలుకు బస్సులో వెళ్లి రైలులో వెళ్లాల్సి ఉంది. గుంటూరు-తిరుపతి రైలును చెన్నై వరకు పొడిగిస్తే వ్యాపారులకు, ఇంజనీరింగ్ విద్యార్థులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

రోజూ తిప్పాలి

హూరి నుంచి బెంగళూరు వరకు వారానికి ఒక పర్యాయం తిరుగుతున్న రైలును డైలీ సర్వీస్‌గా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. గరీబ్‌రథ్ రైలును కూడా వీక్లీ కాకుండా వారానికి 3 రోజులు తిప్పాలని, గిద్దలూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



గిద్దలూరు రైల్వే స్టేషన్

పునరుద్ధరణ చేయరా ?

కొత్త రైళ్ల సంగతి దేవుడెరుగు ఆపిన రైళ్లను పునరుద్ధరణ చేయకపోవడం రైల్వే అధికారులకే చెల్లింది. కరోనా సమయంలో అన్ని రైళ్లను ఆపి కరోనా అనంతరం ఒక్కొక్క రైలును పునరుద్ధరించిన అధికారులు ఇప్పటివరకు ఈ రూటులో తిరుగుతున్న బెంగళూరు ప్యాసింజర్ రైలును నేటికీ పునరుద్ధరించలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ నుంచి గిద్దలూరు మీదుగా బెంగళూరుకు ప్రతిరోజు ప్యాసింజర్ రైలు నడిచేది. ఏళ్ల తరబడి నడిచిన ఈ రైలును కరోనా సమయంలో ఆపేశారు. అనంతరం మిగతా రైళ్లను వేసినా, ఈ రైలును మాత్రం పునరుద్ధరించలేదు. దీంతో పేద మధ్యతరగతి ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది.

ప్యాసింజర్ రైళ్లు రద్దు

అసలే గ్రామీణ ప్రాంతం. ఈ రూటులో మాత్రం ఒక్క ప్యాసింజర్ రైలు కూడా తిరగకపోవడం బాధాకరం. గతంలో ఎక్కువ ప్యాసింజర్ రైళ్లు, తక్కువ ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరిగేవి. గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందేవి. కానీ కాలక్రమేణా కరోనా అనంతరం ఒక్కొక్క ప్యాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్ రైలుగా మార్పు చేశారు. ఈ రూటులో పగలు గాని, రాత్రి గాని ఒక్క ప్యాసింజర్ రైలు కూడా తిరగడం లేదు. అన్నీ ఎక్స్‌ప్రెస్ రైళ్లే నడుస్తున్నాయి. ప్యాసింజర్ రైళ్లు తిరగకపోవడంతో కేఎస్‌పల్లి, గుడిమెట్ట తదితర గ్రామీణ రైల్వేస్టేషన్లలో ఏ ఒక్క రైలు ఆగక చివరకు రైల్వేస్టేషన్‌లను సైతం మూసివేసే పరిస్థితి నెలకొన్నది. ప్రయాణికుల సమస్యలపట్ల ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


రోడ్డును కమ్మేసిన కంప చెట్లు

కంపచెట్లను తొలగించాలి

గిద్దలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజానగర్‌లో రోడ్డు మార్జిన్లలో ఉండే కంపచెట్లు పెరిగి సగం రోడ్డును ఆక్రమించాయి. సిమెంట్ రోడ్డు నిర్మించినప్పటికీ సగం దారిలో కంపచెట్ల కొమ్మలు వ్యాపించి ఉండడంతో ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో మోటార్ సైక్లిస్టులు, పాదచారులు ఇక్కట్లకు గురవుతున్నారు. దట్టంగా వ్యాపించిన కంప చెట్లను తొలగించాలని ఆప్రాంత ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

20న తిరంగా ర్యాలీ

గిద్దలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వీరోచిత పోరాటం చేసిన సైనికులకు సంఘీభావం తెలిపేందుకు ఈనెల 20వ తేదీన గిద్దలూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం వెటరన్ జేఏసీ ఛైర్మన్ కెప్టెన్ అంకన్న, కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 20వతేదీ ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తిరంగా ర్యాలీ ప్రారంభం అవుతుందని, కూరగాయల మార్కెట్, కుమ్మరాంకట్ట, రైల్వేస్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని సైనిక, మాజీ సైనికులు, కుటుంబీకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మార్కాపురం : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19న తిరంగా యాత్ర జరుగనున్నట్లు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తెలిపారు. స్థానిక గడియార స్తంభం సెంటర్ నుంచి ఉదయం 9.00 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని అన్నారు. అక్కడ నుంచి నాలుగు ప్రధాన వీధుల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, దేశాభిమానులందరూ తప్పక పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా


సీపీఐ జెండా వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దదోర్నాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అండగా ఎర్రజెండా నిలిచిందని నియోజవర్గ సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ 5వ మండల మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దేవండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఐ అవిర్భావం నుంచి పేదల పక్షాన నిలబడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు బాణాల రామయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తిరుమలయ్య, నాయకులు మౌలాలి ,దూదేకుల మస్తాన్, పాపయ్య, కాశిరెడ్డి, వెంకటేశ్వర్లు,చిన్నరామయ్య,రఫీ, కాశయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రహమాన్

పెద్ద దోర్నాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమయిందని మార్కాపురం, కనిగిరి డివిజన్ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రహమాన్, శ్రీనివాసులు ఆరోపించారు. సాధనిక పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అస్తవ్యస్తమయిన విద్యా వ్యవస్తను గాడిలో పెట్టేందుకు ప్రతి పంచాయతీలో మోడల్ ప్రమరీ స్కూల్ ఇస్తూ 59మంది విద్యార్థులకు 4పోస్టులు 60మందికి 5 పోస్టులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వంనిర్బందంగా ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిందన్నారు. ఏ ఒక్కపాఠశాలను మూసివేయకేండా, పోస్టులు రద్దు చేయకుండా మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తోడ్పడాలని కోరారు.


సమావేశంలో పాల్గొన్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు

25న తాలూకా ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు

కంభం, మే 18 (ఆంధ్రజ్యోతి) : కంభం తాలూకా ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు ఈనెల 25వ తేదీ ఆదివారం స్థానిక పింఛనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరుగుతాయని ఎన్నికల అధికారి పొందు రంగారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలంలో పని చేసే అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని కంభం తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మెంబర్లను ఎన్నుకోవాలని తెలిపారు. ఎన్నికలను పర్యవేక్షించేందుకు జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరన్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వరకుమార్ పాల్గొంటారని, కంభం తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

మార్కాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో నేడు వైస్ ఎంపీపీ స్థానానికి ఎన్నిక ప్రక్రియ జరుగనున్నట్లు డీఎల్‌డీవో కే శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. మార్కాపురం మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గోగులదిన్నె ఎంపీటీసీ సభ్యుడు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. వీటిలో నికరంపల్లి ఎంపీటీసీ సభ్యుడు మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. మిగిలిన 13 మందిలో తిప్పాయపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ప్రస్తుతం ఎంపీపీగా కొనసాగుతున్నారు. రాయవరం ఎంపీటీసీ సభ్యురాలు వైస్ ఎంపీపీ-1గా కొనసాగుతున్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. వైస్ ఎంపీపీ ఎన్నికకు సంబంధించిన నోటీసులను ఈ పాటికే అందరు ఎంపీటీసీ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

గిద్దలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నంద్యాలకు చెందిన ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదామ్ ఒక ప్రకటనలో తెలిపారు. రొమ్ము, నోరు, గర్భాశయం, జీర్ణాశయ, ప్రొస్టేట్, కాలేయం, ఊపిరితిత్తుల క్యాన్సర్లకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు హాజరవుతున్న దృష్ట్యా రోగులు శిబిరాన్ని ఉపయోగించుకోవాలని, పాత రిపోర్టులు ఉంటే తెచ్చుకోవాలని సూచించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులలో వెలసి ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

చెన్నయ్యను దర్శించుకున్న తాతయ్యస్వామి


స్వామిని దర్శించుకుంటున్న తాతయ్యస్వామి, ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ అత్యాత్మిక మాతాజీ సద్గురు తాతయ్యస్వామి మాతాజీ ఆదివారం స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న తాతయ్యస్వామి మాతాజీ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, అర్చకుడు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, జవ్వాజి రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

గిద్దలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం జెల్లివారిపుల్లల చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో గడ్డి మేసేందుకు వెళ్లిన గొర్రెలపై పిడుగు పడడంతో 22 గొర్రెలు మృతి చెందాయి. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో పిడుగులు పడ్డాయి. అటవీ ప్రాంతంలో గడ్డిని మేసేందుకు వెళ్లిన 22 గొర్రెలు పిడుగుపాటుకు మృతిచెందాయి. జెల్లివారిపుల్లల చెరువుకు చెందిన వడ్డేరు రంగయ్యకు చెందిన 12 గొర్రెలు, పామూరు శ్రీనివాసులుకు చెందిన 5 గొర్రెలు, గోతం ఖాశింవలికి చెందిన 5 గొర్రెలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటాయని, ప్రభుత్వం ఆదుకోవాలని వాటి యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు నియోజకవర్గ టీడీపీ మహానాడు

మార్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం నియోజకవర్గ టీడీపీ మహానాడు ఈ నెల 19న సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు.

స్థానిక కాలేజీ రోడ్డులోని శుభం కన్వెషన్ హాలులో ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. నియోజకవర్గంలోని మార్కాపురం, పొదిలి పట్టణాలు, నాలుగు మండలాల నుంచి టీడీపీ శ్రేణులు హాజరుకావాలన్నారు. ముఖ్యంగా గ్రామ, వార్డు, బూత్ కమిటీల సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లోని నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు అందరూ హాజరుకావాలన్నారు. స్థానిక దోర్నాల బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి శుభం కన్వెన్షన్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. టీడీపీ అభిమానులు, కార్యకర్తలు తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

హెచ్‌ఐవీపై అవగాహన

పెద్ద దోర్నాల,మే 18 (ఆంధ్రజ్యోతి) : నటరాజ్ కూడలిలో హాండ్స్ ఆఫ్ కంపాషన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ విజ్ఞేశ్వర నాటక కళా బృందం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా సంస్థ నాటక కళా జాతా బృందంతో వీధి నాటకం ప్రదర్శించారు. ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వస్తే తీసుకోవాలసిన సూచనలు చేస్తూ వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్, బెంజిమన్, ప్రతి నిధులు పీ తిరుమలయ్య, రేణుకాదేవి, శ్రావణి, రాణి, భవాని పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ సర్పంచి దాడి


చికిత్స పొందుతున్న వీరారెడ్డి

పెద్దారవీడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తపై వైసీపీ సర్పంచ్ దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మండలంలోని పెద్దారవీడులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పుచ్చకాయలపల్లికి చెందిన వీరారెడ్డి, వైసీపీ సర్పంచి రామిరెడ్డి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అది పెచ్చుమీరి వీరారెడ్డిపై రామిరెడ్డి దాడి చేశారు. దీంతో వీరారెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ని మార్కాపురం ప్రభుత్వ ప్రజా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసులో నిందితుల అరెస్టు


పెద్ద దోర్నాల, మే 18(ఆంధ్రజ్యోతి) : అసైన్డ్ భూములను మోసపూరితంగా ఇతరులకు విక్రయించిన కేసులో నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్లు ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను తెలుపుతూ మండలంలోని ఐనముక్కల పరిధిలోని 73 ఎకరాలు ఫ్రీ హోల్డు భూములను ఇతరులకు మోసపూరితంగా విక్రయించిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించిన దోర్నాల తహసీల్దార్ కిన్నెర శాంతి భూములకు సంబంధించిన నివేదికలతో ఎస్సై మహేష్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఎస్సై పుల్లా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అంకన్నతో పాటు భూముల రిజిస్ట్రేషన్‌కు సహకరించిన వీర భద్రాపురం, చందవరం, గొల్లవిడిపి, ఎర్రగొండపాలెం తదితర గ్రామాలకు చెందిన 14 మంది నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఇవే భూములను గతంలో దుర్గికి చెందిన వ్యక్తికి అమ్మకానికి పెట్టగా ఫ్రీ హోల్డు భూములను కొనడానికి నిరాకరించాడు, దీంతో పామూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులకు రూ.70లక్షలకు విక్రయించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూమికి చెందిన వ్యక్తులు కాకుండా ఇతర వ్యక్తుల ఆధార్ కార్డులతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్లు వివరించారు.

పేద ఆర్యవైశ్యులకు దుస్తుల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

మార్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్యులకు చీరలు, పంచెల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక మెయిన్ బజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో 100 మంది మహిళలకు చీరలు, 10 మందికి పంచలు అందించారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్షుడు చీదెళ్ల లక్ష్మణరావు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు సంస్థ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక తోడ్పాటు, వెనుకబడిన వారి అభివృద్ధికి ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరిగే బ్రహ్మోత్సవాలు, రథసప్తమి కార్యక్రమాల సమయంలో వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆవోపా కోశాధికారి పెరుమాళ్ల కోటిమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్‌వీ సుబ్బారావు, స్టేట్ మెంబర్ దేవిశెట్టి రామశేఖర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు నాగేశ్వరరావు, కేశవరావు, లక్ష్మీనారాయణ, చలమయ్య, రామకృష్ణ, వెన్న వెంకటసుబ్బారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


ప్రతిభా పురస్కారాన్ని అందిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ శివరామయ్య

మార్కాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమంగా రాణించిన పలువురు విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ముగ్గురు ఇంటర్, 11 మంది 10వ తరగతి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పోకూరి శివరామయ్య మాట్లాడుతూ విద్యలో అత్యుత్తమంగా రాణించే వారిని గుర్తించి ప్రోత్సహిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థులు ఎవరైనా చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడేవాళ్లు ఉంటే తప్పక తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తర్లుపాడు జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

52 వాహనదారులకు జరిమానా

ఎర్రగొండపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం పాతఅన్నసముద్రం ఆదివారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి 52 ద్విచక్రవాహనదారులకు జరిమానా వేశారు. కార్యక్రమంలో సీఐ అస్సాన్, త్రిపురాంతకం ఎస్ఐ బసవరాజు, దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, కురిచేడు ఎస్ఐ శివ పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

మర్కాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బైకు ఢీకొని మండలంలోని దరిమడుగు గ్రామానికి చెందిన కవలకుంట్ల రాజ్‌కుమార్ (28) మృతి చెందాడు. రాజ్‌కుమార్ ఆదివారం గేదెలను పొలం నుంచి ఇంటికి తోలుకెళ్తుండగా పైపాలెం మండలం బోయలపల్లి నుంచి తర్లుపాడు మండలం సీతానాగులవరానికి వెంకటయ్య తన బాబాయితో కలిసి బైకుపై వస్తుండగా రాజ్‌కుమార్‌ను ఢీకొట్టారు. రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, బైకుపై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు వివరాలు నమోదు చేశారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మతల్లి భక్తుల కోర్కెలను తీర్చే తల్లిగా పూజిస్తూ జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులు గంగమ్మకు మొక్కలు తీర్చుకుంటూ పొంగళ్లు పెట్టి పొంగళ్లగిన్నె నెత్తిన పెట్టుకుని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యంగా సమర్పించారు. కొందరు భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. వివిధ గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్పీ ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), మే 18 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమార్చన విశేషపూజలు నిర్వహించారు. ఆలయ గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ప్రదక్షిణలు చేస్తూ మహా నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, పామూరు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డికి సన్మానం

పామూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన శ్యామల కాశిరెడ్డిని పామూరు టీడీపీ శ్రేణులు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసేవారిని అధిష్ఠానం గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. శ్యామలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీనివాసులు, కావేరి రసూల్, జి.శ్రీనుతో పాటు కనిగిరి, పీసీపల్లి శ్రేణులు ఉన్నారు.

యువతిని మోసంచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ముండ్లమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి గర్భవతిని చేసిన అదే గ్రామానికి చెందిన ఇస్తాన మణికంఠ పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.కమలాకర్ తెలిపారు. ఆతర్వాత ఆమెను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. మోసపోయిన యువతి ముండ్లమూరు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

నేడు ఫిజియోథెరపీపై శిక్షణ

తాళ్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఫిజియోథెరపీపై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) తెలిపారు. బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ ఆనర్స్ హిస్టరీ, ఎకనామిక్స్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9703884065 నెంబరును సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

సీఎస్‌పురం(పామూరు), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో పామూరు, సీఎస్‌పురం, సీతారామపురం మండలాల స్థాయిలో నిర్వహించే వేసవి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ముత్యాల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లసంతో పాటు దేహదారుఢ్యం ఏర్పడుతుందన్నారు. ప్రథమ బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.10,116 ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బడులు తెరిచినరోజే..
విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

» ఇప్పటికే మండలానికి చేరిన వైనం

» వచ్చే విద్యాసంవత్సరంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

దొనకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం బడి తెరచిన రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు అందించేలా విద్యాశాఖ అధికారులు సంసిద్ధమయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పటిష్ట చర్యలు చేపట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి పాఠ్యపుస్తకాలన్నీ పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందజేయాలనే ప్రణాళికలు రూపొందించి ఆమేరకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు చేరాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో అన్నీ సబ్జెక్టులకు చెందిన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరగకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అటువంటి పరిస్థితులు తలెత్తకుండా వేసవి సెలవల్లోనే పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరేలా చర్యలు చేపట్టింది. దొనకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 5800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి 25వేల వరకు పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ప్రస్తుతం మండలానికి 20వేల వరకు పాఠ్యపుస్తకాలు చేరాయి. మిగిలిన పుస్తకాలు త్వరలో రానున్నట్లు మండల విద్యాశాఖ తెలుపుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ఉజ్వల భవిషత్తే లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుండటంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దొనకొండ మండలానికి చేరిన ఉచిత పాఠ్య పుస్తకాలు

అధికారుల ఆదేశాలతో పాఠశాలలకు చేరుస్తాం

- ఎన్.సాంబశివరావు, ఎంఈవో



మండల కేంద్రానికి ఉచిత పాఠ్యపుస్తకాలు చేరాయి. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసిన వెంటనే పాఠశాలలకు చేరుస్తాం. బడులు తెరచిన రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించేలా సంసిద్ధంగా ఉన్నాం.

నేడు కనిగిరిలో మినీ మహానాడు

కనిగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో సోమవారం మినీ మహానాడు జరుగనుంది. కనిగిరి - కందుకూరు రోడ్డు మార్గంలో ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహణకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లుచేశారు. కార్యక్రమానికి వచ్చేందుకు నియోజకవర్గంలోని ఆరుమండలాల నుంచి నాయకులు శ్రేణులను సమాయత్తం చేశారు. పార్టీ రాష్ట్రనాయకత్వం పిలుపు మేరకు రాష్ట్రం లోని అన్ని ప్రాంతాల్లో మినీ మహానాడు ఏర్పాటు జరుగుతుండగా కనిగిరిలో జరిగే కార్యక్రమం హైలెట్‌గా నిలవనుందని ప్రజల్లో చర్చ నడుస్తుంది. ఏర్పాట్ల విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

దర్శిలో..

దర్శి, మే 18(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో గల పీటీఎస్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మెన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కనిగిరి - కందుకూరు రోడ్డులో మినీ మహానాడు సందర్భంగా రోడ్డుకిరువైపులా ఏర్పాటుచేసిన పార్టీ జెండాలు

టీడీపీ బలోపేతానికి కృషి

» పార్టీ మండలాధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ముండ్లమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆపార్టీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దర్శిలో జరిగిన ఆపార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కడియాల రమేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా శంకరాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కూరపాటి శ్రీనివాసరావు మండల అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవినేని కోటేశ్వరరావు, సోమేపల్లి శ్రీనివారావు, మేదరమెట్ల వెంకటరావులు పదవిని ఆశించగా చివరికి మండల నాయకుల ఆమోదంతో శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

ఈసందర్భంగా కూరపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనను రెండవ సారి ఎన్నుకున్న మండంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండలపు వెంకటరావు, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, సోమేపల్లి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీని వాసరావు, సర్పంచ్‌లు కూరపాటి నారాయణ స్వామి, గజ్జల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీల ఎంపిక

దర్శి మే 18(ఆంధ్రజ్యోతి): దర్శిలో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు టీడీపీ కమిటీలను ఖరారు చేశారు.

దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడిగా పుల్లలచెరువు చిన్నా, దర్శి రూరల్ అధ్యక్షుడిగా మారెళ్ళ వెంకటేశ్వర్లు, తాళ్ళూరు మండల అధ్యక్షుడిగా మేడగం వెంకటేశ్వర రెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడిగా కూరపాటి శ్రీనివాసరావు, కురిచేడు మండల అధ్యక్షుడిగా పిడతల నెమలయ్య నియమితులయ్యారు.

తాళ్లూరు అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి

తాళ్లూరు, మే 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా మేడగం వెంకటేశ్వరరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దర్శిలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, కడియాల రమేష్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ముందుగా మండల నేతలతో టీడీపీ అధ్యక్షుడి ఎన్నికపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరి ఆమోదంతో యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ లక్కవరం గ్రామానికి చెందిన మేడగం వెంకటేశ్వరరెడ్డిని అధ్యక్షుడిగా ఎంపిక చేశారు.



మేడగం వెంకటేశ్వరరెడ్డి

ఈసందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తుత మండల అధ్యక్షుడు బి.ఓబుల్ రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వి.సుబ్బయ్య, ఐవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ అధ్యక్షుడిగా ఆంజనేయులు

దొనకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ దొనకొండ మండల అధ్యక్షుడిగా యర్రబాలెంకు చెందిన మోడి ఆంజనేయులును ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఖరారు చేశారు. మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉండి పార్టీ అభ్యున్నతికి బాధ్యతగా కృషి చేస్తానని ఆంజనేయులు తెలిపారు.



మోడి ఆంజనేయులు

వైభవంగా సాయిబాబాకు కుంభాభిషేకం

కనిగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా దేవస్థానం నిర్మించి 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం ఆదివారం వైభవంగా ముగిసింది. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ్య శ్రీప్రజ్ఞానంద సరస్వతీ(బాలస్వామి) అమృత హస్తాలతో మహాకుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి అనుగ్రహ భాషణం, ఆశీర్వచనం నిర్వహించారు. ఈసందర్భంగా హోమాలు, యజ్ఞాలలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సతీసమేతంగా డాక్టర్ కవితతో కలసి పాల్గొని హోమ కృతువులు నిర్వహించారు. అనంతరం దేవాలయాలలో దేవతామూర్తులు శ్రీమహాగణపతి, దత్తాత్రేయుడు, షిర్డీ సాయిబాబా, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహామూర్తులకు పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామి వారితో కలసి వేదపండితులు రమేష్‌శర్మలు కుంభాభిషేకం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ సాయిబాబా దేవస్థానంలో కుంభాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారన్నారు. దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, దేవస్థానం గౌరవాధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, బోయిళ్ళ తిరుపతిరెడ్డి, జాతీయ వాసవీసత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, కొప్పరపు సత్యాలు, తదితరులుపాల్గొన్నారు. కుంభాభిషేక కార్యక్రమాన్ని తిలకించేందుకు పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు అశేషంగా పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, డాక్టర్ కవిత

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పీసీపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1999-2000లో పదో తరగతి చదివినవారు కలుసుకున్నారు. అప్పట్లో వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు ఒక్కరోజు ముందుగానే పీసీపల్లికి చేరుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత ఒకరినొకరు కలుసుకుని చదివిన నాటి మధుర జ్ఞాపకాలను తలచుకుంటూ సంతోషంగా గడిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతానికి ఇప్పటికీ పాఠశాలలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. తమలాంటి ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి తీర్చిదిద్దిన గురువులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లరెడ్డి, రామిరెడ్డి, వి.మాలకొండారెడ్డి, జి.క్రిష్టారెడ్డి, వెంకటేశ్వర్లు, రఘురామిరెడ్డి, వి.కవిత, గోగాడి రత్తయ్య, చెన్నయ్య, ప్రస్తుత హెచ్ఎం ఆంజనేయులు, ప్రస్తుత ఎంఈవోలు శ్రీనివాసులు, సంజీవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై దాడులు

కనిగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెల్లరాయిని అక్రమంగా తవ్వుతున్న ముఠాను ఫారెస్ట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. కనిగిరి ఇన్‌చార్జ్ ఫారెస్ట్ అధికారి నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీర్లదిన్నె, జమ్మలమడక గ్రామాల్లోని అటవీప్రాంతంలో అక్రమంగా తెల్లరాయి తవ్వుతుండగా ఆకస్మిక దాడి చేశారు. ఎక్స్‌కవేటర్, ఏడుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఫారెస్ట్ అధికారి తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు చేసే వారి వివరాలను తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సబ్‌జైలు నిర్మాణానికి స్థల పరిశీలన

దర్శి, మే 18(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో నూతన సబ్ జైలు నిర్మాణానికి జైళ్లశాఖ డీఐజీ ఎం.వరప్రసాద్ ఆదివారం సాయంత్రం అను వైన స్థలం కోసం పరిశీలన చేశారు. దర్శి మున్సిపాలిటీ పరిధిలోని శివ రాజ్‌నగర్ వద్ద ప్రభుత్వ స్థలాన్ని, లంకోజనపల్లి కొండవద్ద గల ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసంద ర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ దర్శిలో అధునాతన వసతులతో నూతన సబ్‌జైలు నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న అన్నీ స్థలాలను పరిశీలించి అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట జిల్లా అధికారులు వరుణ్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, దర్శి సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

దర్శి, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. దర్శిలో ఆదివారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అగ్రిగోల్డ్ బాధితులు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. అనేకమంది ఒత్తిడి తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తగిన నాయ్యం చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే అమలుచేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనుమారెడ్డి, ఎం.రమేష్‌బాబు, అగ్రిగోల్డ్ యూనియన్ నాయకులు నర్సయ్య, సీహెచ్ ప్రసాద్, సీహెచ్ కొండయ్యశెట్టి, నాసరయ్య, ఏవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన ఆపరేషన్ సిందూర్

పామూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికుల ధైర్య సాహసాలను కీర్తిస్తూ ఆదివారం పట్టణంలో కూటమి సభ్యులు జాతీయ జెండాలను చేత పట్టుకొని తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సత్యదేవుని దేవస్థానం వద్ద నుంచి జాతీయ జెండాలతో ప్రదర్శనగా మమ్మిడాడీ సెంటర్ వద్దకు చేరుకొన్నారు. ఈసందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మడి శ్రీను, జె.చినసుబ్బయ్య, కేవీ సుబ్బారావు, కె.హరగోపాల్, హజరత్, ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఎస్.సాంబయ్య, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్, టి.సుబ్బారావు, ఎస్.నాగేంద్రచారి, బి.సత్యం, శేషం మోషే, దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని ప్రోత్సహించాలి

దర్శి, మే 18(ఆంధ్రజ్యోతి): నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి జరిగిన దర్శినాపురి నాటక కళాపరిషత్ ముగింపు వేడుకల్లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దర్శిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ఆనందదాయకమన్నారు. ఇందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.అనంత్, సభ్యులు పాల్గొన్నారు.

మోపాడులో ప్రారంభమైన తిరునాళ్ల

పామూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు జలాశయం వద్ద వెలసిఉన్న శ్రీ గంగా భవాని అమ్మవారి తిరునాళ్ల ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు అమ్మవారి నిలుపు కార్యక్రమాన్ని మేళతాళాలతో నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు.

కార్యకర్తను పరామర్శించిన ఉగ్ర

పామూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటకట్టకిందపల్లి పంచాయతి డీవీపల్లిలో టీడీపీ కార్యకర్త మాదిరెడ్డి మాలకొండారెడ్డిని ఎమ్మెల్యే ఉగ్ర ఆదివారం పరామర్శించారు. గ్రామంలో జరిగిన కారక్రమంలో పాల్గొన్న ఉగ్ర మాదిరెడ్డి ఇంటికెళ్లి పరామర్శించారు. ఆయన వెంట యారవ శ్రీనువాసులు, గట్లా కొండారెడ్డి, తదితరులు ఉన్నారు.

వారానికోసారి తాగునీటి సరఫరా

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ముండ్లమూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న ఎన్ఏపీ నీరు వారానికి ఒకసారి సరఫరా అవుతున్నాయి. దీంతో దాహార్తి తీర్చుకొనేందుకు పలుగ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్థిక స్థోమతలేని వారు గ్రామాల్లో ఉన్న మంచి నీటి బోరింగ్‌ల వద్దకు వెళ్ళి నీరు తెచ్చుకొని దాహార్తి తీర్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. కొందరైతే పాల క్యాన్‌లు, రమ్ములతో పొలాల్లోని వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

దర్శి నుంచి ముండ్లమూరు మండలానికి సరఫరా అయ్యే ఎన్ఏపీ పైపులైన్ పసుపుగల్లు వద్ద పగిలిపోయి వృథాగా నీరు పోతుంది. మండలంలోని పసుపుగల్లు, నాయుడుపాలెం, తమ్మలూరు, ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, భీమవరం, ఈదర, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, పోలవరం, శంకరాపురం, సింగనపాలెం, లక్ష్మీనగర్, వేముల, వేములబండ గ్రామాలకు ఎన్ఏపీ నీరు నిలిచి పోయింది. ప్రస్తుతం వేసవి కాలం కావటంతో దాహార్తి సమస్య తీవ్రంగా ఉంది. ఎన్ఎస్‌పీ అధికారులు కనీసం వారానికి ఒకసారి కాకుండా రోజు మార్చి రోజైనా తాగునీరు సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉష్ణోగ్రత (అంచనా)

19-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	28
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	36	27
చీరాల	35	28


రేపల్లె : ప్రకాశం రోడ్డులో డ్రెయినేజీపై నిర్మించిన మెట్లు


చీరాల : దండుబాట రోడ్డులో డ్రెయిన్‌లు ఆక్రమించి నిర్మించిన భవనాలు

డ్రెయినన్నీ మూత

మురుగు పారేదెలా?

రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. తెల్లారి లేచి చూసిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టే పరిస్థితి లేనంతగా నీరు, మురుగుతో రోడ్లన్నీ నిండిపోయాయి. పట్టణ మధ్యలోని ప్రాంతాలతో పాటు శివార్లలోనూ ఇదే పరిస్థితి. వర్షపు నీరు పారుదల లేనంతగా కాల్వలన్నీ ఆక్రమించేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయినా మున్సిపల్ పాలకుల్లో చలనం లేదు. ఓ మోస్తరు వర్షాలకే రోడ్లన్నీ తటాకాల్లా మారుతున్నా.. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా.. పరిస్థితి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కాల్వల్లో చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించే అవకాశం లేకుండా శ్లాబులతో మూతేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. దీంతో అటు కాల్వల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండగా.. ఇటు వానొస్తే వరద అన్నట్లు పట్టణాల్లో పరిస్థితి నెలకొంది.

- ఆక్రమణల్లో సైడు కాల్వలు
- పూడిక తొలగించే పరిస్థితీ లేదు
- మురుగు పారక ప్రజల అవస్థలు
- చినుకుపడితే రహదారులన్నీ జలమయం
- ఆక్రమణలపై దృష్టి సారించని పుర పాలకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

వానొస్తే.. వరద.. వణుకు

వర్షాలు వస్తున్నాయంటే గుంటూరు నగరం, జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు మున్సిపల్ పట్టణాల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన కాల్వలు ఆక్రమణలతో కొన్ని కుదించుకోగా.. మరికొన్ని పూడిక తీసే అవకాశం లేకుండా దుకాణదారులు, ఇళ్ల యజమానులు మూతేశారు. దీంతో డ్రెయిన్లు చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగే అతి కష్టంగా పారుదలవుతుంటుంది. ఈ పరిస్థితుల్లో వర్షపు నీరు పోయే దారి లేక.. డ్రెయిన్లలోని మురుగునీటికి వర్షపు నీరు తోడై రోడ్లపైకి వచ్చేస్తోంది. దీంతో ప్రధాన రహదారులతో పాటు శివారు కాలనీలు వర్షాల సమయంలో తటాకాల్లా మారుతాయి. అపరిశుభ్రత.. దుర్వాసన.. చెత్తా చెదారాలతో ప్రజలు వర్షాలు వస్తున్నాయం టే ప్రజలు ఆం దోళన చెందుతున్నారు.


బాపట్ల రథంబజారులో డ్రెయినేజీని ఆక్రమించి విస్తరించిన దుకాణాలు


అద్దంకిలోని నామ్ రోడ్డులో పూడ్చి ఉంచిన సైడ్ డ్రెయిన్లు

(ఆంధ్రజ్యోతి - బాపట్ల నెట్‌వర్క్)

పేరుకు మున్సిపల్ పట్టణాలు.. అయినా వర్షాల సమయంలో మురికి కూపా లుగా మారిపోతున్నాయి. ప్రధాన డ్రెయిన్లతో పాటు సైడు కాల్వలు కూడా ఆక్రమణలకు గురవుతు న్నా యి. మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేయకుండా సైడ్ డ్రె యిన్లను శ్లాబు, బండలతో మూతేస్తున్నారు. కాల్వ ల్లో పడుతున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులకు పెద్ద తల నొప్పిగా మారింది. కాల్వలపైనే ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్లపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లో ము న్సిపల్ అధికారులు కాల్వలపై ఆక్రమణలు పట్టించుకోకపోవడంతో ఇదే అవకాశంగా మిగిలిన వారు కూడా చెలరేగిపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అధికా రులు నోటీసులు, ప్రచారాలకే పరిమితమవు తున్నా రు. దీంతో వర్షాలు సమయంలో మురుగునీరు రోడ్ల పైకి చేరుతోంది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ సమయాల్లో మున్సిపల్ పాలకు లు, అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత కూడా కాల్వలపై ఆక్రమణలను తొలగించి వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చూసి ముంపు సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలం దగ్గరకు వస్తున్నా పురపాలకులు వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీసే పనులు చేపట్టడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

* బాపట్లలో ప్రధాన రహదార్ల వెంబడి డ్రెయినేజీలను దుకాణదారులు ఆక్రమించేశారు. జీబీసీరోడ్డు, రథంబజారు, సూర్యలంకరోడ్లలో, పటేల్‌నగర్, రైలుపేట పరిసర ప్రాంతాల్లోని డ్రె యిన్లలో పూడిక తీసే పరిస్థితి లేదు. మున్సిపల్ అధికారులు ఇప్పటికి రెండుసార్లు డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలిగించినా మళ్లీ నిర్మాణాలు చేపట్టారు.

* రేపల్లెలో డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమైపోతున్నాయి. ప్రకాశంరోడ్డు, పద్మాటాకీస్‌రోడ్డు, బస్టాండ్‌రోడ్డు, నిజాంపట్నంరోడ్డు, లక్ష్మీటాకీస్‌రోడ్డు, ఓల్డుటౌన్‌లో కాల్వలను దుకాణదారులు పూర్తిస్థాయిలో మూతేశారు. ఆయా డ్రెయిన్లలో చెత్తాచెదారాల తొలగింపు మున్సిపల్ కార్మికులకు కష్టతరంగా మారింది. అయినా ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించిన దాఖలాలు లేవు.

* అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయంరోడ్డు, బంగ్లా రోడ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో రోడ్ల వెంబడి సైడ్ డ్రెయిన్లను అటు వ్యాపారులు, ఇటు ఇళ్ల యజమానులు ఆక్రమించుకుని శ్లాబులు వేసుకున్నారు. ఆయా డ్రెయిన్లలో ఏళ్లుగా పూడిక తొలగించే అవకాశం లేక పూర్తిగా పూడిపోయాయి. నామ్ రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రెయిన్ల నిర్మాణ సమయంలోనే మూసివేయడంతో ఇటీవల పూడికతీత పనులు చేపట్టేందుకు పలుచోట్ల పగలగొట్టారు.

* చీరాలలో దండుబాటలోని డ్రెయిన్ మూడు కిలోమీటర్ల మేర ఆక్రమ ణ లకు గురైంది. పెద్ద భవనాలు, ఇళ్లు, దుకాణాలు ఏర్పాటు చేశారు. 33 వార్డుల నుంచి వివిధ రూపాల్లో వ్యర్థ జలాలు పారు దల జరిగే ఈ దండుబాట డ్రెయిన్ ఆక్రమణలకు గురికావడంతో ఎక్కడికక్కడే మురుగు పేరుకు పోతోంది.


రేపల్లె : స్టేట్‌బ్యాంకు రోడ్డులో డ్రెయిన్‌లపై ఆక్రమణలు


చీరాల : దండుబాట రోడ్డులో డ్రెయిన్‌లు ఆక్రమించి నిర్మించిన భవనాలు

ప్రతిపాదించినా.. పట్టించుకోరు

తాగునీటి కేటాయింపులపై తాత్సారం

- 10 టీఎంసీలు కావాలన్నా స్పందించని ప్రభుత్వం
- కేఆర్‌ఎంబీ అనుమతిస్తేనే సాగర్ నుంచి నీటి విడుదల
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పల్లెల్లో నీటి ఎద్దడి

50 శాతం చెరువుల్లో నిండుకున్న నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువుల్లో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి.. ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి తాగు అవసరాలకు నీటి విడుదల విషయంలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలున్నాయి. సాగర్ కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాల్లో చెరువులు నింపేందుకు 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే రోజులు గడు స్తున్నా కేటాయింపులపై నేటికీ నిర్ణయిం తీసు కోలే దు. ఈ నెల మూడో వా రంలో నీటి సరఫరా చేయ నున్నట్లు ముందుగానే జలవనరుల శాఖ ప్రక టించింది. అయితే కేఆర్ ఎంబీ నుంచి ఇంతవరకు అనుమతులు రాకపోవడం తో నీటి విడుదల ప్రశ్నా ర్థకంగా మారింది. కుడి కాల్వకు కేటా యింపుల మించి నీటి ని వినియోగించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం కేఆర్‌ఎంబీ వద్ద వాదిస్తోంది. తాగు అవసరాలకు కూడా నీటి విడుదలకు అనుమతి ఇవ్వొద్దని కేఆర్‌ఎంబీపై ఆ రాష్ట్ర అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ వాదనను తిప్పి కొడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించాలని కేఆర్‌ఎంబీపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చకముందే సాగర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


బొల్లాపల్లి : గండిగనుమలలో నీటి కోసం పాట్లు

కుడి కాల్వ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన వందలాది చెరువులు సాగర్ జలాలపై ఆధారపడి ఉన్నాయి. దాదాపు 50 శాతం చెరువుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ గణాంకా లు చెబుతున్నాయి. చెరువులకు సత్వరం నీటిని సరఫరా చేయా లని ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ నుంచి జలవనరుల శాఖకు ప్రతిపాదనలు అందాయి. వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల తదతర మున్సి పాల్టీల్లోని చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నెలకొన్న తాగు నీటి ఎద్దడిని కేఆర్‌ఎంబీ దృష్టికి తీసుకువెళ్లి నీటి కేటాయింపులు పొందాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంది. కనీసం 8 టీఎంసీలు నీటిని సాగర్ నుంచి వినియో గించుకునేందుకు కేఆర్‌ఎంబీ అనుమతులు ఇవ్వాలన్న వాద నను అధికారులు వినిపిస్తున్నారు. తాగు అవసరాలకు 10 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారుల కు ప్రతిపాదనలు పంపినామని, అయితే ఇంకా అనుమతి రాలేదని జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు.

సాఫీగా.. జేఈఈ అడ్వాన్స్

గుంటూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీ కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, నరసరావుపేట పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ బేస్డ్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి 12 వరకు సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను పరీక్షకు గంట ముందు కేంద్రాల్లోకి అనుమతించారు. దాదాపు 6000 మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సమాచారం.

త్రికరణ శుద్ధి..!

- మురుగునీటి శుద్ధిప్లాంట్ పనులు ముందుకు
- జమ్ములపాలెంరోడ్డులో రూ.5.40 కోట్లతో పనులు
- పూర్తయితే..మరో రెండు ప్లాంట్లకు ముందడుగు..
- సాగు భూమికి స్వచ్ఛనీరు పారుదల లక్ష్యం


జమ్ములపాలెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్

బాపట్ల, మే18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా ముందుకు సాగుతోంది. బాపట్ల పట్టణంలో మూడు మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లు నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పనులను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. పురపాలక సంఘం పరిధిలో ముందుగా జమ్ములపాలెంరోడ్డులోని డంపింగ్‌యార్డు రోడ్డు వద్ద ఈస్ట్, వెస్ట్ శ్యాంప్ డ్రెయిన్లు, జమ్ములపాలెం నుంచి వచ్చే డ్రెయిన్ కలిసేచోట రూ.5.40 కోట్లతో ప్లాంటు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు ముందుకు సాగుతున్నాయి. పట్టణంలోని 34 వార్డుల నుంచి మురుగు నీరు వచ్చి ఈస్ట్ శ్యాంప్, వెస్ట్ శ్యాంప్ భీమునిగుంట వాగులో కలుస్తుంది. ఈ నీటితో శివారు ప్రాంత రైతులు వరి, కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు, అపరాలు సాగు చేస్తుంటారు. పట్టణం నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే వ్యవసాయ అవసరాలకు వినియోగించాలి. కానీ, ప్రస్తుతం మురుగు నీటిని పంటల సాగుకు నేరుగా వాడుతున్నారు. వెస్ట్ శ్యాంప్ డ్రెయిన్ నుంచి రోజు 3 వేల మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే ప్లాంట్ నిర్మించడం పట్ల రైతులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని కోసం ఎకరన్నర భూమిని కూడా కేటాయించారు.

మరో రెండు..

మొదటిగా డంపింగ్ యార్డు దగ్గర నిర్మిస్తున్న ప్లాంట్ పూర్తయిన వెంటనే పంటలకు శుద్ధి జలాలు అందించే అవకాశం ఉంటుంది. మురుగు కాల్వ నుంచి సముద్రానికి వెళ్లే కలుషిత నీరును శుభ్రం చేయడం వల్ల సముద్ర జీవరాశులు నశించిపోకుండా ఉంటాయి. ఈ ప్లాంటు పూర్తయితే.. మూలపాలెం రోడ్డులో మరో ప్లాంట్ నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఆ ప్రాంతంలో ఒక ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించడానికి ఎకరం భూమి కావాలి. ఇక్కడ అసైన్డ్ భూమి ఉంది కాబట్టి కేటాయించాలని రెవెన్యూ శాఖను స్థానిక మున్సిపల్ అధికారులు కోరారు. అదేవిధంగా మరుప్రోలువారిపాలెం గ్రామ పరిధిలో 5ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 3వ ప్లాంట్ కూడా నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వభూమి ఇక్కడ అందుబాటులో లేదు. భూసేకరణ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది.

ప్రజారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో

మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులు ప్రజారోగ్యశాఖాధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. మొదటిగా నిర్మిస్తున్న ప్లాంట్ సక్సెస్ అయిన వెంటనే మిగిలిన రెండు ప్లాంట్‌లు కూడా నిర్మించే అవకాశం ఉంది. దీని కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే అవి కూడా నిర్మాణంలోకి వస్తాయి. ఇదేవిధంగా మిగిలిన పట్టణాల్లో కూడా మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ల నిర్మాణంపై కదలిక వచ్చినట్లు సమాచారం.

నేడు శింగరకొండలో మహాకుంభాభిషేకం

- విధుశేఖరభారతీస్వామిచే ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే 18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం 9.03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు గురువందనం, గణపతి, మండల పూజలు, వేదపారాయణం, సుందరకాండ పారాయణం, శాంతి హవన ములు, మహాపూర్ణాహుతి తదితర పూజలు జరగనున్నాయి. విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం 9.03 గంటలకు ధ్వజయంత్రస్థాపన, జీవధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖర కుంభాభిషేకం నిర్వహించనున్నారు. స్వామి వారికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పిస్తారని అధికారులు తెలిపారు. పూజా కార్యక్రమాలకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు హాజరుకానున్నారు.


శింగరకొండకు చేరిన గజరాజు

విద్యుత్ వెలుగుల్లో శింగరకొండ

మహాకుంభాభిషేకం సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయం దేదీప్యమానంగా మారింది. భక్తుల కోసం వివిధ సామాజిక సత్రాలలో అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు. మహాకుంభాభిషేకం సందర్భంగా అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి ఆలయం వరకు సుమారు 1500 మంది మహిళలు సుమారు 6 కిమీ కలశయాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రలో ముందుభాగాన నడిచేందుకు కర్ణాటకలోని రాయచూరు నుంచి గజరాజును తెప్పించారు. ఆదివారం వేకువజామున గజరాజు శింగరకొండకు చేరుకుంది.


విద్యుత్ దీపాల వెలుగులో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

అవీ..ఇవీ..

పిడుగుపాటుకు గేదె మృతి

● ఒకే ప్రాంతంలో రెండో ఘటనతో ప్రజలు భయాందోళన

కొత్తపాలెం(చీరాల), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపడి గేదె మృతిచెందింది. అర్ధరాత్రి సమయం నుంచే చాలా సేపు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలోనే పాటుతో అక్కల జాలమ్మకు చెందిన గేదె మృతి చెందినట్లు యజమాని చెబుతున్నాడు. దీనిపై అధికారులు ఇప్పటికే వివరాలు నమోదు చేసుకున్నారు. అయితే సమీపంలోనే ఇటీవల పడిన పిడుగు కారణంగా రెండు ఎద్దు మృత్యువాత పడిన సంగతి విదితమే. అందుకు ప్రభుత్వం నుండి సాయం కూడా అందింది. అయితే వరుస ఘటనలతో గ్రామ ప్రజలు కొంత భీతిల్లుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అద్దంకి, మే18(ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలుసుకొని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపోమేనేజర్ బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 9959225697 సెల్‌నంబరుకు ఫోన్ చేసి తెలియచేయాలని కోరారు.

వీడని మిస్టరీగా యువకుని మృతదేహం

పర్చూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో గుర్తు తెలియని యువకుని మృతి మిస్టరీగా మారింది. మృతిచెందిన యువకుడు ఎవరనే విషయం తెలియకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలోనే ఉంచారు. అయితే మృతదేహం పడిఉన్న తీరు, మృతుని వయస్సు తదితర అంశాలను పరిశీలించి యువకుడు ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తిగా ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ప్రయాణీకులు ప్రజలతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ తోపాటు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండే ప్రాంతంలో ఇలా గుర్తుతెలియని మృతదేహం లభించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసు మాత్రం యాచకుడై ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. ఏది ఏమైన పూర్తిస్థాయి విచారణ చేపడితే తప్ప మృతదేహం ఎవరిది, మృతికి గల కారణాలు ఏమిటి అన్న విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొని వ్యక్తికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ మస్తాన్‌వలి

అద్దంకి, మే 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శింగరకొండ రోడ్డులోని ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్నాయి. దీంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ద్వారకానగర్ సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇందిరాగనర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు.

దివ్యాంగుల విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్


ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ చేపడుతున్న భవిత కేంద్రం సిబ్బంది

బల్లికురవ, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో మూడేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని బల్లికురవ మండల భవితకేంద్రం ఐఈఆర్‌టీలు నాగబాబు, నాజీనిలు తెలిపారు. ఆదివారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో దివ్యాంగ విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్చుకోనేందుకు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులు ఎవరు ఉన్నా, వెంటనే భవిత కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. భవితకేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారంలో ఒక రోజు ఫిజీయోథెరఫీ కూడా చేయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం భవిత కేంద్రంలో విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయిస్తోందన్నారు.

రాజస్థాన్ కార్మికుడి మృతిపై కేసు

చీమకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు ఆదివారం మృతి చెందాడని సీఐ సుబ్బారావు చెప్పారు. స్వరూప్‌రావు(34) అనే కార్మికుడు డ్యూటీ ముగించుకున్న తదుపరి తన గదికి వచ్చి నిద్రపోయాడని, అదే రూంలో ఉంటున్న మరో కార్మికుడు కొంత సేపటి తర్వాత స్వరూప్‌రావును నిద్రలేపగా లేవకపోవటంతో తోటి కార్మికులకు విషయాన్ని తెలిపాడు. వారు వచ్చి చూసి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి

ఆంధ్రజ్యోతితో సీఐ సూరేపల్లి సుబ్బారావు ముఖాముఖి


సీఐ సుబ్బారావు

చీరాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో రౌడీమూకల వ్యవహార శైలి ఇబ్బందికరంగా మారింది. ఈక్రమంలో నేరాలను నియంత్రించేందుకు పోలీసుశాఖ అప్రమత్తమవతోంది. 'ఆంధ్రజ్యోతి'తో వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు పలు వివరాలు పంచుకున్నారు.

ప్ర : పట్టణంలో రౌడీషీటర్ల కట్టడికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జ : ఇటీవలే బదిలీపై వచ్చినప్పటికీ, ఇక్కడ పరిస్థితులపై క్షుణ్ణంగా తెలుసుకున్నాను. నేర నియంత్రణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రౌడీషీటర్ల కట్టడిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సూచనలు ఉన్నాయి. దీంతో నేరగాళ్లపై ముందస్తు నిఘా ఉంచాం.

ప్ర : ఇప్పటి వరకు ఏమైనా కౌన్సెలింగ్ ఇచ్చారా..?

జ : తాజాగా ఓ కేసుకు సంబంధించి విచారణలో భాగంగా పిలిపించాము. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించాము. భిన్నంగా వ్యవహరిస్తే పీడీ యాక్టులు నమోదు చేస్తాము.

ప్ర : ఇటీవల చోరీలు అధికమయ్యాయి. చర్యలు ఏమైనా ఉన్నాయా ?

జ : ఇటీవల ఓఇంట్లో భారీ మొత్తంలో జరిగిన చోరీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గంటల వ్యవధిలో ఛేదించాము. అలాగే అంతర్గత వీధుల్లో సీసీ కెమెరాలకు సూచనలు చేస్తున్నాము. యజమానులు కూడా జాగ్రత్తలు పాటించాలి.

ప్ర : పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై చర్యలు ఉన్నాయా ?

జ : పట్టణంలో వాహన రద్దీ అధికంగా ఉంది. కొందరు దుకాణదారుల్లో కూడా నిర్లక్ష్యం ఉంది. రెండురోజుల్లో కచ్చితమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాము. అందుకు ప్రజల సహకారం ఉండాలి.

ప్ర : స్టేషన్‌లో సేవలు పారదర్శకంగా అందిస్తున్నారా ?

జ : బాధితులకు ఒక విషయం స్పష్టం చేస్తునాము. శాంతిభద్రత సమస్యలు ఎదురయినప్పుడు నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. దళారు వ్యవస్థ స్టేషన్లలో లేదు. సామాన్యులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాము. నేరుగా వచ్చి పరిష్కారం పొందవచ్చు.

దేశసత్తా చాటిన వీరజవాన్లు

● తిరంగ ర్యాలీలో ఎమ్మెల్యే కొండయ్య ● పట్టణంలో త్రివర్ణ పతాకాలతో ర్యాలీ


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, డా.మహేంద్రనాథ్

చీరాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సైనికులు వీరోచిత పోరాటం చేసి ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటారని, ఇది ప్రతి భారత పౌరుని విజయమని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పేరాల గోలి సదాశివుడు కల్యాణ మండపం నుంచి ప్రారంభమై గడియార స్తంభం కూడలి మీదుగా ముక్కోణం పార్క్ వరకు తిరంగ ర్యాలీ సాగింది. నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పాక్ ఉగ్రమూకలు దేశవ్యవస్థను దెబ్బతీసే విధంగా దాడులకు యత్నించారన్నారు. అమాయక పర్యాటకులపై విచక్షణ రహితంగా దాడిచేసి హత్య చేశారన్నారు. దీంతో భారత జవానులు పాక్ ఉగ్రవాదుల ఎత్తులను తిప్పికొట్టడమే కాకుండా, వారిని మట్టుబెట్టి వారి స్థావరాలను భారత సైనికులు ధ్వంసం చేశారని ఎమ్మెల్యే వివరించారు. దేశ సమగ్రతను పరిరక్షించడంతో ప్రదాని మోదీ సరైన సమయం లో ప్రణాళికలు రూపొందించ నట్లు చెప్పారు. ఇదిప్రతి భార తీయుని విజయమని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంఎంసీచైర్మన్ జనార్ధనరావు, పెద్దఎత్తున టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు. ప్రజలు పాల్గొన్నారు.


అద్దంకిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అద్దంకి : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆదివారం సాయంత్రం అద్దంకిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అద్దంకి పట్టణంలోని గాంధీ బొమ్మ కూడలి నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ కూడలి మీదగా అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఉగ్రవాదులపై పోరులో అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు వారు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, మన్నం త్రిమూర్తులు, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, గోవాడ శ్రీకాంత్, చేబ్రోలు సుబ్బయ్య, బచ్చల వాసు, వడ్డవల్లి పూర్ణ చంద్రరావు, కరిముల్లా, బీజేపీ నేతలు జాగర్లమూడి యలమంద రావు, పర్చూరు శ్రీనివాసరావు, విరాట్, జనసేన నేత గోరంట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

రాతి మండప నిర్మాణానికి విరాళాలు


కోనేటి వెంకటేశ్వర్లు, కుమారుడు కళ్యాణ్ లకు రసీదు అందజేస్తున్న ఈఓ తిమ్మానాయుడు

అద్దంకి, మే18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండప నిర్మాణానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కొత్తదామావారిపాలేనికి చెందిన టీడీపీ అద్దంకి పట్టణ మాజీ అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు, కుమారుడు కళ్యాణ్‌లు రూ.3,69,999లు, అద్దంకి మండలంలోని చినకొత్తపల్లికి చెందిన టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ మానం మురళీమోహన్‌దాస్, సరిత దంపతులు రూ.1,01,116లు అందజేశారు. మేదరమెట్లకు చెందిన మద్దాళి సంజీవరావు, మల్లేశ్వరి దంపతులు, కుమారుడు సురేంద్రబాబు, ఇందిరాదేవి దంపతులు రాతి మండపం పడమర ద్వారం ఏర్పాటుకు అవసరమైన నగదును అందజేశారు. అద్దంకి మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ యేజండ్ల నాగరాజు మండపం నిర్మాణానికి రూ.1.18 లక్షలు అందజేశారు. సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ధరలపై ప్రశ్నిస్తున్న భక్తుడు

ఇష్టారాజ్యంగా పూజాసామగ్రి ధరలు

అద్దంకి : శింగరకొండలో సాధారణ రోజులలోనే పూజాసామగ్రి ధరలు అంటే భక్తులు బెంబేలెత్తె పరిస్థితి ఉంది. మహాకుంభాభిషేకం సందర్భంగా దుకాణాల నిర్వాహకులు ధరలు రెట్టింపు చేశారు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదనలకు దిగుతున్నారు. అయితే వ్యాపారులు కూడా తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తూ భక్తులను ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. దేవస్థానం అధికారులు మహాకుంభాభిషేకము ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడంతో పూజా సామగ్రి ధరల నియంత్రణపై అజమాయిషీ లేకుండా పోయింది. సోమవారం ధరలు మరింత పెంచి అమ్మడం ఖాయంగా కనిపిస్తుంది. అధికారులు స్పందించి ధరలను నియం త్రించే విధంగా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

స్వర్ణమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ

స్వర్ణ (పర్చూరు), మే 18 (ఆంధ్రజ్యోతి) కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలో వేంచేసిన స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. నేటి నుండి రెండు రోజుల పాటు తిరునాళ్ల నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గ్రామాన్ని వరదలు ముంచెత్తే సమయంలో తన చీర కొంగును అడ్డుపెట్టి గ్రామాన్ని కాపాడిందని భక్తుల విశ్వాసం. మూడు రోజుల పాటు తిరునాళ్ళ వేడుకలను నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా 32వ వార్షిక తిరునాళ్లలో భాగంగా సోమవారం నుంచి తిరునాళ్ల ప్రారంభం కానుంది. మొదటి రోజు అమ్మవారికి పసుపు కుంకుమలు భక్తులు సమర్పిస్తారు. ప్రతి ఇంటి నుండి ఆడపడు చుకు పసుపు కుంకుమ తీసుకురావడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. ఆడపడుచు ఎక్కడ ఉన్నా ఏటా అమ్మవారి తిరునాళ్లకు విధిగా రావడం గ్రామ సాంప్రదాయంగా మారింది. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా అమ్మవారికి తొలి శుభలేఖను అందజేయటం మరో విశేషం. ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మతల్లి 3వ కొలుపులు మహోత్సవం ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటి వద్ద పొంగళ్లు పెట్టుకొని, తర్వాత ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. అదేవిధంగా తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలో అన్నదానం నిర్వహించారు.



స్వర్ణమ్మ దేవాలయం, వలపర్లలో పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

తిరుములకు బయలుదేరిన కూరగాయల లారీ


తిరుమలకు బయలుదేరిన కూరగాయల లారీ

మార్టూరు, మే18(ఆంధ్రజ్యోతి):కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరునిస్వామి నివాసం తిరుమలలోని అన్నదానసత్రానికి ఆదివారం మార్టూరు నుంచి లక్షన్నర రూపాయల విలువైన కూరగాయలను లారీలో పంపించారు. బండారుపల్లి హరిబాబు కుటుంబసభ్యులు దాతృత్వంతో భక్తులు కూరగాయలను కొనుగోలు చేసి తిరుపతి తిరుమల దేవస్థానం నుండి వచ్చిన లారీలో కూరగాయలను పంపించారు. ఈ సందర్భంగా మార్టూరులో తూర్పుబజారున వినాయకుని గుడి వద్ద కూరగాయల లారీ వద్ద దాత హరిబాబు జండా ఊపి ప్రారంభించారు. అదేవిదంగా మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, కంభంపాటి శ్రీనివాసరావు, దివ్వె ప్రసాద్, తేలప్రోలు శ్రీనివాసరావు, కమ్మ శివనాగేశ్వరరావు తదితరులు వినాయకుని గుడిలో స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు కూరగాయల లారీ వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం అక్కడ నుంచి కూరగాయల లారీ బద్దురాయి సెంటరు,గన్నవరం రోడ్డు మీదగా ర్యాలీగా పెద్దఖానా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా కోలాటం ప్రదర్శించారు. అంతేగాకుండా లారీ ముందు మహిళలు కోలాటం ప్రదర్శింస్తుం డగా భక్తులు ఉత్సాహంగా లారీ వెంట నడచారు. పెద్దఖానా వద్ద పలువురు మహిళలు కూరగాయల లారీవద్ద హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామి వారి లడ్డూ ప్రసాదంగా పంపిణీ చేశారు.ఇంకా పులిహార, మజ్జిగ ప్యాకెట్లును భక్తులకు పంపిణీ చేశారు.అనంతరం తిరుమలకు బయలుదేరిన లారీకి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

భారీగా తరలి వచ్చిన ప్రజలు


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చెరుకూరు (పర్చూరు), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరుకూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుండి పెద్ద ఎత్తున కంటి సమస్య ఉన్నవారు వైద్యశిబిరానికి హాజరుకావడంతో ఆ ప్రాంగణం కిక్కిరిసింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీడీపీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. వేసవి నేపథ్యంలో ప్రత్యేకంగా షామియానాలు ఏర్పాటు చేసి పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. తొలుత దివంగత నందమూరి తారక రామారావు, విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు షేక్. షంషుద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఉషారాణి, కారుమంచి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు షేక్. జమాలుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, మానం హరిబాబు, పాలేటి కోటేశ్వరరావు, దాసరి రామకృష్ణ, ఫ్యాక్టరీ శ్రీను, ఆకుల శ్రీనివాసరవు, నరేంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

553 మంది రోగులు హాజరు

ఉచిత మెగా వైద్యశిబిరానికి వివిధ గ్రామాల నుండి 553 మంది రోగులు హాజరుకాగా, వారికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 158 మందికి శస్త్రచికిత్సలు అవ సరం అని నిర్ధారించారు. వేసవి తాపం తట్టుకునే విధంగా రోగులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను కూడా అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం భోజన ఏర్పాటు చేశారు.

రాజకీయాలకు అతీతంగా సేవాకార్యక్రమాలు

సామాజిక సేవే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గ ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన పర్చూరు నియోజక వర్గంలో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య భద్రతనిస్తూ ప్రతినిత్యం అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

కమ్యూనిటీ కిచెన్ సేవలు ప్రశంసనీయం


సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి చిలుకూరి శ్రీధర్

పంగులూరు,మే 18 (ఆంధ్రజ్యోతి): పంగులూరులో కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ఏర్పాటు చేసి వృద్ధులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని కాకతీయ ఫౌండేషన్ డొనేషన్స్ క్లబ్‌చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో ఆదివారం పంగులూరు కాకతీయ ఫౌండేషన్ తొలివార్షికోత్సవం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు చిలుకూరి శ్రీధర్, బాచిన శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాకతీయ ఫౌండేషన్ పేద విద్యార్థుల చదువుకు అందిస్తున్న సేవలను వివరించారు. పంగులూరులో ఆసరా లేని వృద్ధులకు నిత్యం పౌష్టికాహారం అందిస్తున్న కమ్యూనిటీ కిచెన్ నిర్వహణలో పంగులూరు కాకతీయ ఫౌండేషన్‌కు ఆర్థిక సహకారం అందించాలని శ్రీధర్, శ్రీనివాస్ కోరారు. కమ్యూనిటీ కిచెన్ సెంటర్ నిర్వహణలో సేవలందిస్తున్న మహిళలను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు కమ్మ సంఘ ప్రతినిధులు మండవ సుబ్బారావు, నందూరి శ్రీరాములు, అంగకుర్తి నరసింహం, కాకతీయ విద్యా ట్రస్ట్ కోశాధికారి వెంకయ్యచౌదరి, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, ప్రిన్సిపాల్ దొప్పలపూడి శ్రీనివాసరావు, రోటరీక్లబ్ ప్రతినిధి వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, బాచిన చౌదరిబాబు, బాచిన రత్నకుమారి, పరిటాల దేవి, పలువురు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్యకు అభినందనలు


సీతారామయ్యను అభినందిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామయ్య వైద్యరంగంలో అనేక సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని, అలాగే పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులు కావడం మరింత ఆనందంగా ఉందని చెప్పారు. సీతారామయ్య భవిష్యత్‌లో మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్‌లు బీఎస్ సీతారామయ్య, జాలాది మణిబాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి జయశేఖర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

సీతారామయ్యను కలిసిన టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్‌గా ఎన్నికైన కామేపల్లి సీతారామయ్యను బినిడమానూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆదివారం ఒంగోలులో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పైడి నాగేశ్వరరావు, మోషే, సౌలు, బాబురావు,వెంకట్రావు తదితరలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు సహకరించాలి

ఒంగోలు విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి అందరూ సహకరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున మోడల్ ప్రైమరీ స్కూళ్లను వారు స్వాగతించారు. 59 మంది పిల్లలకు నాలుగు, 60 మందికిపైన ఐదు పోస్టులు ఇస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైస్కూళ్ల నుంచి 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకొచ్చే క్రమంలో మిగులుగా తేలుతున్న స్కూలు అసిస్టెంట్లను ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించడానికి చేస్తున్న ప్రయత్నాలను వారు వివరించారు. విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనేందుకు వీలుగా ప్రాథమిక స్థాయిలో ఇంగ్లీషుతో పాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలని కోరారు.

1న అంబేడ్కర్ యువజన సంఘం మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో వచ్చేనెల 1వ తేదీన అంబేద్కర్ యువజన సంఘం ప్రథమమహాసభ జరుగుతుందని ఐపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల వద్ద ఆదివారం మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దాసరి సంగీతరావు, నాగేశ్వరరావు, రమేష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అంకన్న సుబ్బారావు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్

సింగరాయకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ యుద్ధ వాతావరణ నేపథ్యంతో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామాయపట్నం మెరైన్ ఎస్సై మస్తాన్ షరీఫ్ సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెంలో శనివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. గ్రామంలోని కాపులు, ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని తెలిపారు. అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తూ ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1093, రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.6	28.6
కావలి	35	27
ఆత్మకూరు	37	26
ఉదయగిరి	36	26
కందుకూరు	36	27

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

సర్వం సిద్ధం చేసిన అధికారులు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. జిల్లావ్యాప్తంగా 38 కేంద్రాలలో 5,422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 28వ తేదీ వరకు జరిగే పరీక్షలకు నిర్ణీత సమయానికికంటే గంట ముందుగానే కేంద్రాలకు రావాలని అధికారులు తెలిపారు. 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 38 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 280 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవే క్షించనున్నారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తోపాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని డీఈఓ బాలాజీరావు తెలిపారు. అలాగే జిల్లాలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని డీఈఓ తెలిపారు.

● తప్పని ఆర్థిక ఇబ్బందులు



రెండేళ్లుగా ఇబ్బందుల నడుమ టెన్త్ జనరల్, సప్లిమెంటరీ పరీక్షలు, స్పాట్ నిర్వహణను కూడా అప్పులతో పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖకు నేటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో చేతిలో, ఖజానాలో డబ్బులు లేకపోవడంతో సోమవారం నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే కోట్లాది రూపాయలు బకాయిలు ఉండటం, విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం, వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు రావడంతో అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ పరీక్షలతోపాటు వెంటనే జరిగే స్పాట్ నిర్వహణ కష్టతరంగా మారుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో ఐక్యవేదిక నాయకులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

- 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

నెల్లూరు (విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణే ధ్యేయంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాటాలకు సిద్ధమవుతోంది. విద్యాశాఖ అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఆదివారం నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని బలహీన పరుస్తోందని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సాల్ట్ పథకాన్ని యథాతథంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాల విద్యారంగం విచ్ఛిన్నమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ఆరు రకాల పాఠశాలలు ప్రవేశపెడితే ప్రస్తుతం 9 రకాల పాఠశాలను ప్రతిపాదించి అమలు చేయాలనుకోవడం పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనన్నారు. ఇలా అనేక రకాల సమస్యలతో అన్ని సంఘాలు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయం, 23న విద్యాశాఖ కమిషన్ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా ఈ ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎ.సురేంద్రరెడ్డి, నవకోటేశ్వరరావు, పిచ్చిబాబు, శేషులు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, మునీర్, అన్నం శ్రీనివాసులు, ఐక్యవేదిక నాయకులు రాజగోపాలాచారి, పి.అనిల్ కుమార్, చలపతిశర్మ, ఖాజా రహంతుల్లా, నరసింహ మధుసూదనరావు, మస్తాన్, పద్మజ, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు జయంతి సభలో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కలెక్టర్ ఆనంద్, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

పొట్టిశ్రీరాములు పేరిట 22 ఎకరాల్లో మార్కెట్!

- అమరావతిలో కంచువిగ్రహం, స్మృతివనం ఏర్పాటు
- జయంతి సభలో మంత్రి నారాయణ
- అమరజీవికి ఘన నివాళులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజలు జీవించి ఉన్నంత వరకు అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడిగా ఉంటారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరజీవి పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన పొట్టిశ్రీరాములు 125వ జయంతి వేడుకలో మంత్రి నారాయణ పాల్గొని ప్రసంగించారు. అమరజీవి జయంతి సందర్భంగా నగరంలోని 9వ డివిజన్‌లో 22 ఎకరాలలో అత్యాధునిక మార్కెట్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కంచు విగ్రహంతోపాటు స్మృతి వనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ తనది కేరళ రాష్ట్రమని, తనకు తెలిసిన మహోన్నత వ్యక్తి పొట్టిశ్రీరాములేనని తెలిపారు. ఆయన ప్రాణత్యాగం చేసే ముందే దేశం వివిధ రకాలుగా మన భాషలపై పరాయి దేశాలు దాడులు చేసి నాశనం చేశాయన్నారు. అమరజీవి ప్రాణత్యాగం వల్ల దేశంలో భాషలు పరిరక్షించబడ్డాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైశ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఆర్యవైశ్యులకే చెందిన వాడు కాదు.. అన్ని మతాలకు కులాలకు రాజకీయ పార్టీలకు చెందినవాడని అన్నారు. ఈ సభలో పాల్గొన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పొల్యూషన్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కూటమి నేతలు పి.సురేంద్రరెడ్డి, గునుకుల కిషోర్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ఆర్యవైశ్య నాయకులు పేగు.షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, అమరజీవి త్యాగాలను స్మరించుకున్నారు. వేదిక వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి హరికృష్ణ, ఎంపీ ఆంజనేయులు, భవనాసి సురేష్, బ్రహ్మంగుప్తా, దాసా లక్ష్మీనారాయణ, అమరా మోహన్‌రావు ఆర్యవైశ్య నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



నెల్లూరు : ర్యాలీలో పాల్గొన్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి ఇతర నాయకులు



ఆత్మకూరు : తిరంగా యాత్ర ర్యాలీలో పాల్గొన్న మంత్రి ఆనం, కూటమి నాయకులు

భారత రక్షణ దళాల పరాక్రమాన్ని కీర్తిస్తూ 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావంగా నెల్లూరు, ఆత్మకూరులలో ఆదివారం తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆత్మకూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జెండా ఊపి ర్యాలీలను ప్రారంభించారు. 'మనం సైతం దేశం కోసం' అంటూ వేలాది మంది ప్రజలు జాతీయ పతాకాలు చేతబట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ చేసిన నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఇక నెల్లూరు రూరల్ నియోజవర్గ పరిధిలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మనం సైతం.. దేశం కోసం...

'భారత్ మాతా కీ జై' నినాదాలతో మారుమోగిన నెల్లూరు, ఆత్మకూరు

భారీ త్రివర్ణ పతాకాల ప్రదర్శన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/ఆత్మకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులతో పాటు యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల జవానులు అనిర్వచనీయమైన విజయం సాధించారని కొనియాడారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరులను భారత ప్రజలందరూ ఎప్పటికీ గుర్తుంచుకుంటారని వారికి ఘన నివాళి అర్పిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనిక ఉద్యోగులు శ్యాంప్రసాద్, కళాధర్, రత్నయ్య, జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఆత్మకూరులో మున్సిపల్ కార్యాలయం నుంచి సోమశిలరోడ్డు, బీఎస్సార్ సెంటర్, పాతబస్టాండ్ సెంటర్ మీదుగా సత్రం సెంటర్ వరకు తిరంగా యాత్ర ర్యాలీ జరిగింది. కోలాటాలు, మహిళలు ప్రదర్శించిన భారీ జాతీయ పతాకం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం సత్రం సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో 20 మంది విశాంత సైనికులను ఎన్డీఏ కూటమి నేతలు, అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కేవలం మూడు గంటల్లోనే ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికుల వీరోచిత పోరాటపటిమ, యావత్ భారతదేశం శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడం భారత సైనికుల ఘనకీర్తికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీఆర్డీఏ పీడీ నాగరాజుకుమారి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీడీపీ నేత తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవచౌదరి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, పెంచలరావు, పులిమి శైలజారెడ్డి, వెంకటసుబ్బానాయుడు, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, అక్బర్‌బాషా, కూటమి నేతలు, విశ్రాంత సైనికులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● నెల్లూరు రూరల్ : కేవీఆర్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారత్ అంటే ఏమిటో తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భక్తులకు కొడిముద్దలు పంపిణీ చేస్తున్న చైర్మన్, ఈవో తదితరులు

కామాక్షితాయి ఉత్సవాలకు వేడుకగా ధ్వజారోహణం

కొడిముద్దల కోసం ఎగబడిన భక్తజనం

బుచ్చిరెడ్డిపాళెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగా, కామాక్షితాయి సమేతుడిగా మల్లికార్జున స్వామివారిని ఆలయంలోని ధ్వజస్తంభ మండపంలో కొలువుదీర్చి సకలదేవతల ఆహ్వానపూజ, బేరిపూజ, ధ్వజపటానికి ఆహ్వానపూజ, ఇంద్రాది అష్టదిక్పాలక ఆహ్వానపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ధ్వజస్తంభాలకు నంది, త్రిశూలం, డమరుక గురు ఏర్పాటుచేసి దర్భ సూత్ర తాడుతో ధ్వజారోహణం నిర్వహించి కొడిముద్దలను (ధ్వజ ప్రసాదం) నివేదించారు. సంతానం కోసం స్వామి, అమ్మవారి శరణుకోరి వచ్చిన మహిళలకు ఆలయ పండితులు కొడిముద్దలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ చైర్మన్ తీరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీశ్రీనివాసులురెడ్డి సభ్యులు పాల్గొన్నారు. కాగా, ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ అధికారి, డిప్యూటీ కమిషనర్ విజయరాజు ధ్వజారోహణం కార్యక్రమంలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాలలో నేడు

కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం తిరుచా ఉత్సవం, రాత్రి శేషవాహనంపై ఆదిదంపతులు విహరించనున్నారు.

● భక్తుల తోపులాట

కొడిముద్దల కోసం ధ్వజస్తంభాల వద్ద, అంతరాలయంలోకి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఎగబడ్డారు. వీరిని అదుపు చేయడంలో ఆలయ సిబ్బంది విఫలమయ్యారు. ఒక పద్ధతి లేకపోవడం వల్లే ఇలా తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. భక్తుల కోసం రెండు క్యూలైన్లు ఉన్నా ముందస్తు చర్యలు లేకపోవడం వల్ల మహిళలను అసంతృప్తిలో పడేస్తుంది.

జిల్లాలో ఇష్టానుసారంగా గోదాములు

ఇరుకు సందుల్లో వాణిజ్య భవనాలు

ఫైర్ ఇంజన్లు రాలేని పరిస్థితులు

నిబంధనలు పాటించని నిర్మాణాలు ఎన్నో!

హైదరాబాద్‌లో అగ్నిప్రమాదంతో ఉలిక్కిపడ్డ జిల్లా



మన భవంతుల్లో

భద్రత ఎంత?

హైదరాబాద్‌లో చార్మినార్ సమీపాన ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందిన ఘటన జిల్లావాసులను కలవరపాటుకు గురిచేసింది. గతంలో జిల్లాలో జరిగిన పలు అగ్ని ప్రమాదాలను గుర్తు చేసింది. చిన్నబజారు ప్రాంతంలో ఇంటిపై తారాజువ్వ పడి ఇల్లు దగ్ధమైన ఘటన, బోడిగాడితోట వద్ద కెమికల్ గోదాములో జరిగిన అగ్ని ప్రమాదం, అయ్యప్పగుడి సమీపంలో జరిగిన అగ్నిప్రమాదం, రెండు రోజుల ముందు కోవూరులో జరిగిన అగ్నిప్రమాదం.... ఇలా జిల్లాలో జరిగిన వరుస అగ్ని ప్రమాదాలు ముందస్తు జాగ్రత్తలపై ప్రజలను హెచ్చరిస్తున్నాయి.

నెల్లూరు(క్రైం), మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు నగరంతోపాటు పలు పట్టణాల్లో షాపింగ్ మాల్స్, ఫర్నీచర్ మాల్స్, పెద్దపెద్ద వైద్యశాలలు, కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు, పరిశ్రమలు, గోదాములు వందల సంఖ్యలో ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటికి మాత్రమే అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండి అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకొని ఉన్నారు. మిగిలినవన్నీ నిబంధనలకు విరుద్ధమే!. అనధికార భవంతులు, నివాసాల మధ్య ఉంటున్న గోదాముల సంఖ్య అయితే వేలల్లోనే ఉంటుంది. ఇలాంటి వాటిలో ఊహించని సంఘటనలు, ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్టం భారీగా ఉంటుంది.



ఫైర్‌ఇంజన్ తిరిగే చాన్స్ లేదు

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇళ్లు దుకాణాలు, షాపింగ్ మాల్స్, వైద్యశాలలు, అపార్ట్‌మెంట్లను ఇరుకు సందుల్లో, నిబంధనలు పాటించకుండా నిర్మించి ఉన్నారు. కనీసం అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఇంజన్లు కూడా ఆ ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి. ప్రధానంగా నెల్లూరు నగరంలో చిన్నబజారు, పెద్దబజారు, ట్రంకురోడ్డు ఇలా ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లోనూ ఇరుకు సందుల్లో భవనాలు ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో మంటలు ఆర్పలేక ఆస్తి, ప్రాణ నష్టం అధికంగా జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సైతం మంటలను ఆర్పేందుకు అవకాశం లేకపోవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పెద్ద ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం వాటిల్లకముందే అధికారులు కళ్లు తెరిచి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్ పరీక్ష

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ఐఐటీల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలోని కోవూరు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెం ఆయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా 1500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వర కు రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్దకు గంటన్నర ముందుగానే హాజరైన విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.

కండలేరు నీటిమట్టం 43.420 టీఎంసీలు

రాపూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కండలేరు నీటిమట్టం పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 43.420 టీఎంసీల నీరు నిల్వ ఉందని కండలేరు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా అవుట్‌ఫ్లో 1900 క్యూసెక్కులు ఉందని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8982
వెండి కిలో ధర	రూ. 98.200
వెండి ఒక గ్రాము	రూ.101.20

నేడు టీడీపీ మినీ మహానాడు

కందుకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి మినీమహానాడును జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

బెల్టు దుకాణంపై దాడి

● 10 మద్యం సీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కావలి, మే 18(ఆంధ్రజ్యోతి) : కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు తాతా వెంకయ్యను అదుపులోకి తీసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పట్టపగలే ప్రింటింగ్ ప్రెస్‌లో చోరీకి యత్నం

లింగసముద్రం, మే 18 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లోకి ఓ యువకుడు పట్టపగలే దూరి చోరీకి యత్నించాడు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామానికి చెందిన కామేపల్లి మాలకొండయ్య తన ఎంకె ప్రింటింగ్ ప్రెస్‌కు వచ్చి తలుపులు తెరిచి, షాపు లోపలకు వెళ్లే చిన్న గేటుకు తాళం వేసి మళ్లీ ఇంటికి వెళ్లాడు. మాలకొండయ్య తిరిగి 10 గంటల సమయంలో ప్రింటింగ్ ప్రెస్‌కు వచ్చి చూడగా లోపల ఓ యువకుడు ఉన్నాడు. దీంతో ఆయన చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పగా పలువురు ప్రెస్ వద్దకు వచ్చి ఆ యువకుడిని ప్రశ్నించగా, తన పేరు కానీ, ఊరు కానీ చెప్పడం లేదు. కానీ ప్రెస్ లోపల ఉన్న 4 ప్రింటర్లు, 2 సీపీలు, 2 మోనిటర్లు పగులగొట్టాడని బాధితుడు మాలకొండయ్య చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి విగ్రహ పునఃప్రతిష్ఠ

● శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామిచే కుంభాభిషేకం





నవగ్రహ పూజలు చేస్తున్న శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి ఫొటో అందచేస్తున్న విధుశేఖర భారతీ స్వామి

కావలిటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వచనాలతో మహా కుంభాభిషేకం, కలశ పోషణ, మహాదాశీర్వచనం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి విధుశేఖర భారతీ స్వామి ఆశీర్వాదం అందుకున్నారు. ఉదయం గురుప్రార్థన, అవాహిత దేవతా పూజలు, ప్రాణ ప్రతిష్ఠ, ప్రతిష్ఠాంగ హోమం, నవగ్రహ పూజలు జరిగాయి. అనంతం స్వామి వారిచే కలశ ప్రోక్షణ, మహాదాశీర్వచనం, రుత్విక్ సన్మానంతో పూజలు పరిపూర్ణమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కందుకూరి సత్యం, గ్రంధి రమేష్, వోలేటి నాగేశ్వరరావు, పోతుగంటి అలేఖ్య, అమరా వేదగిరి, యేల్చూరి రవి, చీదెళ్ల రామచంద్రరావు, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు







ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న గంగవరపు సుధాకర్, బాలయ్య, కోసూరి సుధీర్

కావలి రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మాగుంట పార్వతమ్మ ట్రంక్‌రోడ్డులోని పుల్లారెడ్డి నగర్ వద్ద, మండలంలోని వెంగయ్యగారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. మండలంలోని తాళ్లపాలెంకు చెందిన కోసూరి సుధీర్ వెంగయ్యగారిపాలెంలోని అత్తగారి ఇంటికి వచ్చి అక్కడ నుంచి మోటారు బైక్‌పై మద్దూరుపాడు వైపు జాతీయ రహదారిపై వెళుతుండగా పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన గంగవరపు సుధాకర్ తన స్నేహితుడు చీకుర్తి బాలయ్యతో కలిసి మోటారు బైక్‌పై తాటికాయల కోసం జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెంగయ్యగారిపాలెం వైపు వెళుతూ ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటారు బైక్‌లు నడుపుతున్న సుధాకర్, సుధీర్‌లకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేటు, బాలయ్యను ఏరియా ఆసుపత్రులకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సుధాకర్‌ను నెల్లూరుకు తరలించారు. అలాగే ముసునూరుకు చెందిన చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, తన కుమారుడితో కలిసి పట్టణంలోని ఆలయానికి వెళ్లి తిరిగి మోటారుసైకిల్‌పై ముసునూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని ట్రంకురోడ్డు సమీపంలో ఆర్‌కె దాబా వద్దకు వచ్చేసరికి డివైడర్ వద్ద కారు రోడ్డు క్రాస్‌చేస్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. క్షత గాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాల కు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దచెరువులో ఆగని గ్రావెల్ తవ్వకాలు

● ఎమ్మెల్యే ఇంటూరి హెచ్చరించినా రాత్రుళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా



రాజుపాలెం పెద్ద చెరువులో గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన గుంతలు

ఉలవపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువులో గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతోన్నాయి. రాజుపాలెం గ్రామానికి చెందిన ఓ చోటా నాయకుడు, ఉలవపాడుకు చెందిన మరికొందరు శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. సమీప భీమవరం గ్రామం నుంచి 10 ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌లను తీసుకొచ్చి గ్రావెల్ తరలించినట్లు సమాచారం. గత నెల 27వ తేదీ అర్ధరాత్రి ఇలాగే గ్రావెల్ తరలిస్తుండగా స్థానికులు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సదరు వ్యక్తులను గ్రావెల్ తవ్వకాలు చేపట్టవద్దని హెచ్చరించారు. దీంతో కొంతకాలం ఆగినప్పటికీ గత గురువారం అర్ధరాత్రి నుంచి మళ్లీ గ్రావెల్ తోలకం చేపట్టారు. చెరువు ఆనకట్ట ధ్వంసం చేసి యథేచ్ఛగా అక్రమంగా గ్రావెల్ తోలుకుంటున్నా మాకెం పట్టిందన్నట్లు ఇరిగేషన్ అధికార్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత గ్రావెల్ తోలుతున్నారని సమాచారం అందిచేందుకు ఇరిగేషన్ ఏఈ, డీఈలకు రెండు మూడు సార్లు ఫోన్ చేసినా స్పందంచలేదని, తహసీల్దారు శ్రీనివాసులు స్పందించిగా ఆయనకు సమాచారం ఇవ్వగా సిబ్బందికి తెలియపరిచి చర్యలు తీసుకుంటామని చెప్పారని, అయినా తెల్లవారి జామున 4 గంటల వరకు గ్రావెల్ తోలకం జరిగిందని స్థానికులు తెలిపారు.

అడ్డదారులు తొక్కిన విద్యాసంస్థపై

ఉన్నతస్థాయిలో విచారణ

కందుకూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలలో ఆధిపత్యం కోసం అడ్డదారులు తొక్కిన వ్యవహారంపై ఉన్నతస్థాయిలో విచారిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఓ ప్రైవేటు సంస్థ పరీక్షా కేంద్రంలో పోటీ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన విద్యార్థుల ప్రశ్నపత్రాలను ట్యాంపరింగ్ చేసినది వాస్తవమేనని అధికారులు ఓ నిర్ధారణకు వచ్చి పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరిస్తున్నట్లు సమాచారం. విద్యార్థులు అవినాష్, సాయితేజశ్వినితోపాటు ఆ గదిలో పరీక్ష రాసిన ఇషహాక్ అనే మరో విద్యార్థి కూడా తన ఆన్సర్ సీటు కూడా ట్యాంపరింగ్ జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. ఆ గది సీసీ ఫుటేజ్‌ను కూడా తీయించి పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం. సీసీ ఫుటేజ్‌లో ఇన్విజిలేటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు ఆధారాలు సేకరించుకున్న బోర్డు సెక్రటరీ ఈ కేంద్రంలోని కంటైనర్ గదిని కూడా ఆదివారం వీడియో ఫుటేజ్ తెప్పించుకున్నట్లు తెలిసింది. ఒకటీ రెండు రోజుల్లో బాధ్యులందరిపై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

నత్తనడకన ఆర్వోబీ.. ఫుట్‌పాత్ మరమ్మతులు

● రాకపోకలకు పాదచారుల ఇబ్బందులు



ఫుట్‌పాత్‌పై దెబ్బతిన్న బండలు, తొలగించిన బండలు

కావలి, మే 18(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి రోడ్డులో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఆర్వోబీ వంతెన మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతోన్నాయి. దీంతో పాదచారులు వంతెన రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్వోబీ వంతెన మార్గం దెబ్బతిని ఉండటంతో ఇటీవల దానిపై ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచనల మేరకు ఒక లేయర్ తారు వేసి దానిని బాగుచేయించడంతో అందరూ హర్షించారు. అయితే వంతెనకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై గతంలో వేసిన మూత బండలు దెబ్బతిని ఉండటంతో వాటిపై రాకపోకలు కష్టంగా మారాయి. వాటిని తొలగించి దానిపై డస్ట్ వేసి సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డులా వేస్తున్నారు. కానీ ఆపనులు నత్తనడకన సాగుతుండటంతో రాకపోకలకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొలుత ఫుట్‌పాత్‌పై ఉన్న బండలను పైకి లేపి కొన్ని రోజులు వాటిని తొలగించకుండానే అలాగే వదిలేస్తున్నారు. ఆ తర్వాత బండలను తొలగించి కొన్ని రోజులు బాగు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వంతెనపై రాకపోకలు సాగించే పాదచారులు ఫుట్‌పాత్ మరమ్మతుల పనులు కాకపోవటంతో రోడ్డుపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి వంతెనపై ఫుట్‌పాత్ మరమ్మతుల పనులు వేగవంతం చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయంలో చిన్నారులకు ఆటల పోటీలు

ఉలవపాడు, మే 18(ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు శ్రద్ధాశక్తులతో గ్రంథాలయంకు వచ్చే విద్యార్థులకు ముందుగా నీతి కథలు చదివించి వారిలో నైతిక విలువలు పెంపొందేలా తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సృజనాత్మక అంశాలకు సంబంధించిన చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. దాతల సాయంతో వారికి శీతల పానీయాలు, స్నాక్స్ అందజేశారు. ఈ పోటీలను ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాస్కర్‌రాజా పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈసందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణాసంచా నడు మ గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు వినాయక, నవగ్రహాలు, ధ్వజస్తంభం, కలశం ప్రతిష్ఠించారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు నూల వంశస్థులు అన్న ప్రసాద వితరణ చేపట్టగా దొడ్ల మౌలాలీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

అనంతసాగరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. ఈసందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నిర్వాహక కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి పంచాయతీ దేకూరుపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈసందర్భంగా మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పొంగళ్ల సామగ్రితో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణల అనంతరం ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయా కర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లి గ్రామంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక వేదికపై ఉంచి అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ముగిసిన సీతారాముల ఉత్సవాలు

మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. చివరిరోజు స్వామివార్ల వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సహకారంతో ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఉదయగిరి

● రోడ్లపైనే తోపుడుబండ్లు
● రోడ్ల విస్తరణ లేక ఇక్కట్లు
● తరచూ ట్రాఫిక్ కష్టాలు



రోడ్డు మార్జిన్‌లో తోపుడుబండ్లపై వ్యాపారం చేస్తున్న వర్తకులు



రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో స్తంభించిన ట్రాఫిక్

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన మార్గాల్లో తరచూ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీకావు. దశాబ్దాలుగా రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రజలు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. ఒకవైపు నుంచి బస్సు వస్తే రెండోవైపు బస్సు వెళ్లే పరిస్థితి లేదు. వాహనం నిలిచిన వెంటనే పదుల సంఖ్యలో ఇతరత్రా వాహనాలు వెనుక నిలబడిపోతున్నాయి.

దుకాణాలు వదిలేసి రోడ్లపై వ్యాపారాలు

పట్టణంలో కూరగాయలు, మాంసం మార్కెట్‌ను వదిలి వ్యాపారులు రోడ్ల మార్జిన్‌లలో వ్యాపారం చేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా గండిపాళెం మార్గం, మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కూరగాయలు, పండ్లు అమ్మే తోపుడుబండ్లు రోడ్డు మార్జిన్‌లో ఉంచి వ్యాపారాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనదారులు అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో వాహనాలు ముందుకు కదిలే పరిస్థితి లేకుండాపోతోంది. ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్డుపైనే నిలుపుతుండడంతో వాహన రాకపోకలకు మరీ ఇబ్బందికరంగా మారింది. పార్శిల్ వాహనాలను సైతం ప్రధాన మార్గాల్లో రోడ్డుపై ఉంచి వస్తువులను దిగుమతి చేస్తున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.

రోడ్ల విస్తరణ లేక ట్రాఫిక్ కష్టాలు

పట్టణంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గాల్లో రోడ్ల విస్తరణ లేక ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. గతంలో రోడ్డు విస్తరణకు అధికారులు కొలతలు సైతం సేకరించారు. అనంతరం ప్రజాప్రతినిధుల వత్తిళ్ల కారణంగా వెనక్కి తగ్గారు. ఇప్పటికైనా అధికారులు పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి



టీడీపీ నేతలతో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు

సీతారామపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వింజమూరులో సోమవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయి టిడిపి మినీ మహానాడు కార్యక్రమం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన జరుగుతుందని మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మండల టిడిపి నాయకులు ఉదయం 7 గంటలకు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి గురువు ఎన్‌వీ నారాయణరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాల్లో ఉంటూ 30 ఏళ్ల తరువాత కలుసుకుని అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఎంఈవో-2 శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు కారకులైన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ నారాయణరావుతోపాటు ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు నాయబ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్ఎఫ్ఐ నాయకుడు కాకు వెంకటయ్య, పూర్వ విద్యార్థులు జనార్ధన్‌రెడ్డి, జయరామిరెడ్డి, సురేంద్ర, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీదేవి, సురేష్, రమణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 46.370 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 46.370 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ



మనోజస్వంత్, వెంకటవిఘ్నేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్రంలోని బిచోలిమ్, ఛత్రపతి శివాజీ మహరాజ్ మైదానంలో ఈనెల 12వ తేదీ నుంచి 15 వరకు జరిగిన జాతీయస్థాయి జూనియర్ రౌండ్ నెట్‌బాల్ పోటీల్లో ఆత్మకూరు మున్సిపాల్టీకి చెందిన విద్యార్థులు కందుకూరి మనోజస్వంత్, ఎస్ వెంకటవిఘ్నేష్ కాంస్య పతకం సాధించారు. దీంతో వారిని ఉపాధ్యాయులు, పురప్రజలు, పలు పార్టీల నాయకులు అభినందించారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. కాగా, ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం తథ్యం



సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్‌ను సన్మానిస్తున్న వాకర్స్

బిట్రగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో సాధన చేస్తే విద్య, క్రీడల్లో విజయం తథ్యం అని సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్ (మను) అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో జరుగుతున్న వేసవి టైక్వాండో శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శాలువలతో మహేంద్రన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బర్నాడ్, కుందుర్తి శ్రీనివాసులు, ఎన్ఎస్ యాదవ్, పి.స్వర్ణరాజ్, సత్యనారాయణచార్యులు, సలీమ్, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.